# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

ఆదివారం | 17 ఆగస్టు 2025 | 16 పేజీలు




2

## రాష్ట్రస్థాయి సీనియర్ బేస్ బాల్ పోటీలు ప్రారంభం

# ఊళ్లు మునిగె.. గూళ్లు కూలె

## ఎడతెరిపిలేని వానలతో జనజీవనం అస్తవ్యస్తం

- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- చెరువుల్లా మారిన పంట చేలు
- వర్షాలకు తడిసి కూలిన ఇళ్లు
- సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- వరదల్లో చిక్కుకున్న ఆరుగురిని రక్షించిన పోలీసులు
- పరవళ్లు తొక్కుతున్న కుంటాల, పొచ్చెర
- కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- ఉప్పొంగిన వాగులు, నిలిచిన రవాణా సౌకర్యం
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం
- అప్రమత్తమైన అధికారులు
- క్షేత్రస్థాయిలో పర్యటన..
- ఉమ్మడి జిల్లా కలెక్టరేట్‌లలో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు

■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

ఎడతెరిపిలేని వానలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు చిగురు టాకులా వణికిపోతున్నారు. ఎటు చూసినా నీరే... కాలు బయటపెట్టనివ్వని వర్షం. రోడ్డేదో... గుంత ఏదో తెలియని భయానక పరిస్థితి. ఇప్పటికే పదుల సంఖ్యలో ఇళ్లు కుప్పకూలాయి. బయటకు వెళ్లలేక, పాత ఇళ్లలో గడపలేక జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏజెన్సీలో పరిస్థితి మరీ అగమ్యగోచరంగా తయారైంది. కల్వర్టులు కొట్టుకుపోయి, రోడ్లు కోతకు గురై.. స్తంభాలు నేలకొరిగాయి.. పంటలు మొత్తం నీట మునిగాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరుణుడి ప్రతాపం బీభత్సం సృష్టించింది. ఎగువ మహారాష్ట్రలో వర్షాల ప్రభావం కారణంగా ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు అన్నీ నిండాయి. ప్రధాన ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు 18 గేట్లు, స్వర్ణ ప్రాజెక్టు నాలుగు గేట్లు, కొమురం భీం ప్రాజెక్టు నాలుగు గేట్లు, మత్తడి వాగు రెండు గేట్లు, గడ్డన్న వాగు ప్రాజెక్టు మూడు గేట్లు చొప్పున ఎత్తి నీటిని వదులు తున్నారు. కడెం ప్రాజెక్టులో ఒక జాలరి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యారు. చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్, బెజ్జూరు తదితర మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏజెన్సీ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గుడిహత్నూర్ మండలంలో వరదల్లో చిక్కుకున్న ఆరుగురిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.



## గోపాల.. గోపాల

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా జరుపుకున్నారు. చిన్నారులు రాధాకృష్ణ, గోపికల వేషధారణతో సందడి చేశారు. పలు ప్రాంతాల్లో ఉట్టి సంబురాలు జరుపుకున్నారు.





12

## ముగిసిన తీజ్ సంబురం

జాగో బంజారా.. బోరావ్ తీజ్ అంటూ శనివారం గిరిజనులు తీజ్ (మొలకల) పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈనెల 8 నుంచి తొమ్మిది రోజులపాటు కనుల పండువగా నిర్వహించారు. పెళ్లికాని యువతులు, మహిళలు జగదాంబ ఆలయంలో నైవేద్యాలు సమర్పించారు. గ్రామ నాయక్ ఇంటి దగ్గర పందిరిపై ఏర్పాటు చేసిన తీజ్ బుట్టలను దించి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం చేశారు.

## ప్రాజెక్టుల పరిసరాలకు వెళ్లొద్దు

కడెం, ప్రాజెక్టును ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ సందర్శించారు. ఇన్‌ఫ్లో, ఔట్ వివరాలు తెలుసుకున్నారు. ప్రాజెక్టు భద్రతను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయం చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అంతకుముందు స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించారు.



5



14

### కార్మికుల హక్కులను కాపాడే..

## నాయకుడినే గెలిపించుకోవాలి

ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికుల హక్కులను కాపాడే నాయకుడినే గెలిపించుకోవాలని తెలంగాణ కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. శనివారం దేవాపూర్‌లో నిర్వహించి గేటు మీటింగ్‌కు హాజరై మాట్లాడారు.



## భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు
# అప్రమత్తంగా ఉండాలి

- వరదలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం చర్యలు
- వరదల కారణంగా ముందస్తు చర్యలు చేపట్టేందుకు జిల్లా స్థాయిలో ఫ్లడ్ మాన్యువల్ తయారు
- జిల్లాలో విపత్తుల పరిస్థితుల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు కలెక్టర్ సూచన..

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

వాతావరణ శాఖ సూచన, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజారక్షణ విషయంగా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని హాజీపూర్ మండలంలో గల శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టులో నీటిమట్టం వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 24 నుండి 36 గంటలు భారీ నుండి అతి భారీ వర్ష సూచన ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. శనివారం మంచిర్యాల జిల్లాలో రెడ్ అలర్ట్, ఆదివారం ఆరెంజ్ అలర్ట్ ఉందని, ప్రజారక్షణ దిశగా అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో చర్యలు చేపడుతుందని తెలిపారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం 15.6 టి.ఎం.సి. నీరు ఉందని, ఎస్.ఆర్.ఎస్.పి., కడెం ప్రాజెక్టుల నుండి నీటిని విడుదల చేయడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఇన్ఫ్లో పెరుగుతుందని, ప్రాజెక్టులో 17 టి.ఎం.సి. నీటిమట్టం దాటితే ప్రజలకు ప్రమాద హెచ్చరికలు జారీ చేసి నీటిని విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. టామ్ టామ్ ద్వారా నది పరివాహక ప్రాంతాల వద్దకు వెళ్లకుండా, వాగు, నది దాటకూడదని ప్రజలకు తెలియపరచడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం ఏర్పాటు చేసే



బిచ్చగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న భవనాలలో నివసించే వారిని వెంటనే తరలించాలని, వాగులు, నదులు ఉధృతంగా ప్రవహించే సమయంలో ప్రజలను, వాహనదారులను అటువైపుగా వెళ్లకుండా సిబ్బందితో కొండగట్టు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. రహదారులు, కల్వర్టులు దెబ్బతింటే ఆ ప్రాంతంలో ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, వైద్య సిబ్బంది వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రాణ నష్టం, ఆస్తి నష్టం, పశు నష్టం జరగకుండా జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజల తక్షణ సహాయం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736- 250501 ఏర్పాటు చేసి 24 గంటలు అందుబాటులో ఉంటున్నామని తెలిపారు. జిల్లాలో 90 మంది సభ్యులతో కూడిన 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, రక్షణ పరికరాలతో తక్షణ సహాయం కోసం సిద్ధంగా ఉన్నామని తెలిపారు. లో లెవెల్ కాజ్ వేల వద్ద ప్రజలు వెళ్లకుండా భారీ కేడ్లు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి అప్రమత్తత చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎడతెరిపిలేని వానతో జనజీవనం అస్తవ్యస్తం





- జలమయమైన ఇచ్చోడ
- కాలనీలు జలమయం..
- కస్తూరిబా పాఠశాలల్లోకి చేరిన వరద నీరు...
- వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అనిల్

**ఇచ్చోడ, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

శనివారం ఉదయం నుంచి మండలంలో కురుస్తున్న ఏకదాటి వర్షానికి ఇచ్చోడ పట్టణంలోని పలు కాలనీలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలోని విఠలేశ్వర మందిర్ రోడ్డు, విద్యానగర్ కాలనీ, టీచర్స్ కాలనీ, ఎంప్లాయిస్ కాలనీ,ఇస్లాంపూర కాలనీ, అంబేద్కర్ కాలనీ, తో పాటు లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి మండల కేంద్రంలోని బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వరద నీరు చేరడంతో విద్యార్థులతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మండల కేంద్రం నుంచి సిరికొండ, సిరిచెల్మ వైపు వెళ్లే రహదారులు వరద నీరు కారణంగా రోడ్డుపై నుంచే వరద నీరు వెళుతుండడంతో సుమారు 60 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి పలు గ్రామాలలోని పంట చేనులు పూర్తిగా జలమయమయ్యాయి. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలిక పాఠశాల తోపాటు విఠలేశ్వర మందిర్ కాలనీ, కస్తూరిబా పాఠశాలలో చేరిన వరద నీరును ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలను చేశారు. వర్షం ఇలానే ఉంటే విద్యార్థులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి అక్కడి నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు ఏ విధమైన ఇబ్బంది ఉన్న వెంటనే తనకు సంప్రదించాలని ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు. వర్షానికి పలుచోట్ల పలు కాలనీలు జలమయం అయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు.



## ప్రాజెక్టుల పరిసరాలకు
# ఎవరూ వెళ్లొద్దు
### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ ప్రాజెక్టుల పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నది–వాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడెం, స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, ఇతరులు వెళ్లకూడదని హెచ్చరించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తిన వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 91005 77132ను సంప్రదించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.

## పులిహోర ప్యాకెట్‌లు పంపిణీ

**ఆదిలాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

భారీ వర్షాల నేపథ్యంలో ముంపు ప్రాంతాల ప్రజలకు భోజన వసతి కల్పించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్ నగర్, తాడిగూడ కాలనీ వాసులకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్‌లు అందజేశారు.



## చిరుత దాడిలో గేదె మృతి
### భయాందోళనలో గ్రామస్తులు

**కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలంలోని సార్సాల గ్రామంలో చిరుత ప్రాణహాని సృష్టించింది. శుక్రవారం రాత్రి గ్రామానికి చెందిన బూరం పోచయ్య ఇంటి వద్ద తాడుతో కట్టేసి ఉంచిన గేదె పై చిరుత దాడి చేసి చంపేసింది. గ్రామ శివారులోకి చేరుకున్న చిరుత పశువులపై దాడి చేయడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న అటవీ అధికారులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పాదముద్రలు, దాడి తీరును పరిశీలించారు. చిరుత దాడిని ధ్రువీకరించిన అధికారులు, గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. "చిరుత తరచూ గ్రామానికి సమీపంలో తిరుగుతుండటంతో



ప్రజలు రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉండాలి. పశువులను అరణ్యానికి సమీపంగా కట్టకూడదు. ఏవైనా కదలికలు గమనిస్తే వెంటనే అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలి" అని అధికారులు సూచించారు. గ్రామస్థులు అయితే తమ పశువుల రక్షణ కోసం అటవీ శాఖ శాశ్వత చర్యలు తీసుకోవాలని, గ్రామ పరిసరాల్లో కాపలా బలగాలు పెంచాలని కోరుతున్నారు. చిరుత మళ్లీ గ్రామంలోకి రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



జిల్లా బీసీ సంక్షేమ సంఘం పూర్తి కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో జిల్లా అధ్యక్షుడు పొన్నం నారాయణ గౌడ్ ప్రకటించారు. బీసీల హక్కుల కోసం రిజర్వేషన్ల కోసం ఈకమిటీ పని చేస్తుందన్నారు. గౌరవ అధ్యక్షుడుగా డాక్టర్ ఉప్పు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శులుగా పూదరి జనార్ధన్, కత్తి కిరణ్, ఉపాధ్యక్షులుగా భోజన్న, విశాల్ సాయి, బట్టి లింబాద్రి, కార్యదర్శులుగా అంబదాస్, నరహరి, భోజన్న, రాజ మహేందర్, సహకార్యదర్శులుగా సట్ల మహేష్, సాయినాథ్, సంజు, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడుగా పొన్నం రాహుల్ గౌడ్‌లను ప్రకటించారు.

## వీరికి చెలిమె నీరే దిక్కు..!

**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలంలోని నాయకపు గూడ గ్రామంలోని వానాకాలమైనా గిరిజనులకు తాగు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. రెండు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి..! వాగులో చెలిమె నీటిని తెచ్చుకుంటున్నారు. గ్రామంలో 16 గిరిజన కుటుంబాలు ఉండగా గత నాలుగు నెలలుగా గ్రామంలో ఉన్న మిషన్ భగీరథ మంచినీటి పథకాలు పనిచేయడం లేదు. మంచినీటి పథకాలకు మరమ్మతులు చేయించాలని పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రోజు కాలినడకన రెండు కిలోమీటర్లు దూరం వెళ్లి వాగు చెలిమే తోడుకొని నీటిని తీసుకోవచ్చి తాగుతున్నామని చెబుతున్నారు.





## ఆదిలాబాద్‌ను ముంచెత్తిన
# కుండపోత వాన

- పొంగిపొర్లిన వాగులు... నిలిచిన రాకపోకలు...
- ప్రాజెక్టుల అన్ని గేట్లు ఎత్తి నీటి విడుదల...
- వరదల్లో చిక్కుకున్న ఆరుగురి ప్రాణాలను రక్షించేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్, ఎస్పీ
- వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు..

**ఆదిలాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

వరుణుడి ప్రతాపానికి ఆదిలాబాద్ నీట మునిగింది. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో కురిసిన కుండపోత వానతో పలు కాలనీలు, గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. శనివారం ఉదయం ఉరుములు మెరుపులు ఈదురుగాళ్లతో గంటపాటు ఏకధాటిగా దంచి కొట్టిన వానతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. జిల్లా కేంద్రంలోని పలు లోతట్టు ప్రాంతాలతో పాటు కాలనీలు, ప్రధాన రోడ్లు నీట మునిగాయి. ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కారణంగా గుడిహత్నూర్ మండలం సీతగొంది గ్రామంలో ఓ ఇంటిలో గాయక్వాడ్ గణేష్ కుటుంబంలోని సభ్యులు ఆరుగురు చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఘటన స్థలానికి చేరుకొన్నారు.

హుటాహుటిన డిడిఆర్ఎఫ్ బృందాలను పిలిపించి వరదల్లో చిక్కుకున్న ఓ చిన్నారితో పాటు ముగ్గురు ఆడవాళ్లు, ముగ్గురు మొగవాళ్ళను తాడు సహాయంతో సురక్షితంగా బయటకు తీసి కాపాడారు. ఇచ్చోడ లోని రెసిడెన్షియల్ పాఠశాల చుట్టూ వరద నీరు వచ్చి చేరడంతో పాఠశాలలో విద్యార్థులు చిక్కుకున్న విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ ఎస్పీ ఘటన స్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. అదేవిధంగా ఆదిలాబాద్‌లో నీట మునిగిన పలు కాలనీలో సైతం కలెక్టర్ ఎస్పీలు సందర్శించారు. ఆదిలాబాద్ లోని కోజా కాలనీకి చెందిన ఓ వ్యక్తి కార్లో వెళ్తుండగా కాలనీ సమీపంలోని వాగు ఉధృతంగా ప్రవహించడంతో అప్రమత్తమైన ఆయన వెంటనే కారులో నుండి దిగి ప్రాణాలను రక్షించుకున్నారు. వరద ఉధృతికి కారు వాగులో కొట్టుకుపోయింది. మరోవైపు జైనథ్ మండలం తర్ణం వాగులో సైతం 2 లారీలు వరద ఉధృతిలో చిక్కుకుపోయాయి. డ్రైవర్లు క్లీనర్లు సురక్షితంగా బయటపడ్డారు.

**నీట మునిగిన కాలనీలు..**

ఆదిలాబాద్ పట్టణంలోని సుభాష్ నగర్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా ఖోజా కాలనీలో ఇంటి ముందు పార్క్ చేసిన కారు వరద నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. అంబేద్కర్ చౌక్ లో నీరు రావడంతో రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. భాగ్యనగర్ కాలనీలో వర్షపు నీరు ఇండ్లలోకి చేరాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పిట్టలవాడ నుంచి దుర్గా నగర్ కు వెళ్లే



లోలెవల్ వంతెనపై నుంచి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించగా.. రాకపోకలు నిలిచిపోయాయి. దుర్గా కాలనీలో పలు ఇండ్లు నీటిలో మునిగిపోయాయి. మరో పక్క జీఎస్ఎస్టేట్లో వర్షపు నీరు భారీగా చేరి కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా ఇందిరమ్మ కాలనీలో కొన్ని ఇండ్లు నీట మునిగాయి. ఇండ్లలోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో పక్క న్యూ హౌసింగ్ బోర్డ్, విద్యానగర్, తిలక్ నగర్, వాల్మీకి నగర్ లో వర్షపు నీరు ఇండ్లలోకి వచ్చాయి. అదేవిధంగా పట్టణంలోని నటరాజ్ టాకీస్ ఆవరణలో భారీగా వరద నీరు చేరడంతో గేట్లు మూసేసి సినిమా ప్రదర్శనను నిలిపివేశారు.

**వంతెనలపై పోటెత్తిన వరద..**

ఆదిలాబాద్ నుంచి అంకోలి,పిప్పల్ దారి వెళ్లేందుకు శ్రీరామ్ కాలనీ వద్ద ఉన్న లోలెవల్ వంతెనపై నుంచి నీరు ప్రమాదకరంగా ప్రవహించడంతో పోలీసులు ఆ వైపు రాకపోకలను ఆపేశారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తంతోలి, అంకోలి, చించుఘాట్, లింగుగూడ, మామిడిగూడ, పిప్పల్దరి వంతెనలపై భారీగా వరద నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా వరద నీటి ప్రవాహానికి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరో వైపు జైనథ్ మండలం తర్నం బ్రిడ్జి వద్ద రెండు లారీలు వరద ప్రవాహానికి కొట్టుకుపోగా.. లారీ డ్రైవర్‌ను పోలీసులు సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. భీంపూర్ మండలం నిపానిలో ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా.. ఆసుపత్రికి తరలించేందుకు ఆమెను స్ట్రెచర్ పై 108 సిబ్బందితో కలిసి స్థానికులు వాగు దాటించారు. పెన్ గంగా నది వరద ఉధృ తికి ఆనంద్ పూర్ బ్రిడ్జి పై వరద నీటి ప్రవాహం పెరగడంతో తెలంగాణ మహారాష్ట్రకు రాకపోకలు ఆగిపోయాయి.

**అప్రమత్తమైన అధికారులు..**

వర్షాలు భారీగా కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలను కలెక్టర్, ఎస్పీలు పరిశీలించారు. వర్షాలకు ఆయా ఇండ్లలో ఇరుకున్న వారిని దగ్గర ఉండి రక్షించారు. సీతాంగొంది జాతీయ రహదారి వద్ద ఓ ఇంటి చుట్టూ నీరు చేరడంతో.. ఆ ఇంట్లోని ఆరుగురు కుటుంబ సభ్యులు అందులో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న కలెక్టర్,ఎస్పీలు అక్కడి చేరుకుని డీడీఆర్ఎఫ్ బృందం సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అదేవిధంగా పట్టణంలోని సుభాష్ నగర్ లో ఓ ఇంటి చుట్టూ వర్షపు నీరు చేయడంతో కుటుంబ సభ్యులు అందులో చిక్కుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు అక్కడి చేరుకుని వారిని తాళ్ల సాయం బయటకు తీసుకువచ్చారు.

**ఉగ్రరూపం దాల్చిన కుంటాల వాటర్ ఫాల్...**

భారీ వర్షాలతో నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం, మండలంలోని పొచ్చెర జలపాతం ఉగ్రరూపం దాల్చింది. భారీగా వరద నీరు జలపాతాలకు చేరుకోవడంతో వాటర్ ఫాల్స్ ఉధృతిగా పరవళ్ళు తొక్కుతున్నాయి. దీంతో అధికారులు పర్యాటకుల సందర్శనను నిలిపివేశారు.

**ప్రాజెక్టుల అన్ని గేట్లు ఎత్తి నీటినివదిలిన అధికారులు..**

ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షాలతో ప్రాజెక్టులకు వరద పోటెత్తింది. జిల్లాలోని సాత్నాల, మత్తడి వాగు ప్రాజెక్టులకు



భారీగా ఇన్‌ఫ్లో పెరగడంతో అధికారులు ముందస్తు జాగ్రత్తగా సాత్నాల ప్రాజెక్టు లోని మొత్తం నాలుగు గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేశారు. అదేవిధంగా మత్తడి వాగు ప్రాజెక్టులో సైతం ఇన్ఫో పెరగడంతో పూర్తిగా ఐదు గేట్లు ఎత్తివేసి నీటిని విడుదల చేశారు. దీంతో ప్రాజెక్టు దిగువ ప్రాంతాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

**నీట మునిగిన పంట పొలాలు..**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వందల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ముఖ్యంగా పత్తి పంట పెద్దమొత్తంలో నీట మునిగిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి**

ఆదిలాబాద్ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాయల్ శంకర్ పర్యటించారు. లోతట్టు ప్రాంతాల్లో నడుమంటి నీటిలో నుంచి నడుచుకుంటూ వెళ్లి ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సైతం నియోజకవర్గంలోని పలు వరద ప్రాంతాల్లో పర్యటించారు. పలు ఇళ్లల్లోకి వరద నీరు వచ్చి చేరడంతో బాధితులతో మాట్లాడి సహాయక చర్యలు చేపట్టేలా అధికారులకు సూచించారు.



జలదిగ్బంధంలో ఇచ్చోడ

## అందవెల్లి-బట్టుపల్లి రహదారిపై గ్రామస్తుల ఆందోళన

**కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ మండలంలోని అందెల్లి నుండి బట్టుపెల్లి రహదారిపై గ్రామస్థులు ధర్నా చేశారు. శనివారం గ్రామస్తులు ముండ్ల కంచె వేసి రాకపోకలు నిలిపివేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ, రహదారి అధ్వానంగా మారిందని, పలుమార్లు మరమ్మత్తులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకుపోయినప్పటికీ స్పందన కరువైందన్నారు. మరమ్మతులు చేసేంతవరకు ఆందోళన విరమించే ప్రసక్తి లేదని గ్రామస్తులు తేల్చి చెప్పారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ స్వామి కుమార్, ఎస్సైసందీప్ కుమార్, ఎంపీడీవో ప్రసాద్ గ్రామస్తులను సముదాయించినప్పటికీ ససే మీరా అన్నారు. మరమ్మతులు చేస్తామంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.



## తెగిన రోడ్డు.. పది గ్రామాలకు రాకపోకలు బంద్

**కోటపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం ఎదుల్లబంధం, లింగన్నపేట గ్రామాల మార్గ మధ్యలో రోడ్డు తెగిపోవడంతో పది గ్రామాలకు రవాణా వ్యవస్థ నిలిచిపోయింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. తుంతుంగ ప్రాజెక్టు శిఖం నీరు పెద్ద ఎత్తున రావడంతో రోడ్డు మార్గం తెగిపోయింది. గత సంవత్సరం వర్షం కాలంలోనూ వర్షాలకు ఈ రోడ్డు తెగింది. తాత్కాలిక మరమ్మతులు చేయించి చేతులు దులుపుకున్నారు. దీనితో ఇదే సమస్య ఈ ఏడాది సైతం ఉత్పన్నమైంది. ఎదుల్లబంధం, లింగన్నపేట గ్రామాల మార్గ మధ్యలో బ్రిడ్జి నిర్మించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వివేక్



ఇచ్చిన హామి అలాగే ఉండిపోయింది. దీనితో ఏదుల్లబందం, సిర్సా, పుల్లగామ, ఆలుగామ, జనగామ, సుపాక, వెంచపల్లి, నందనంపల్లి తదితర గ్రామాలకు నియోజకవర్గ కేంద్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా మంత్రి వివేక్ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మండల ప్రజలు వేడుకుంటున్నారు.

# జిల్లాలో తొలిసారిగా 313 బిఎన్ఎస్ సెక్షన్ కింద ఇద్దరిపై కేసు నమోదు

### దొంగతనాల కోసం ముఠాను ఏర్పాడిన ముగ్గురి అరెస్టు, పరారీలో మరో ముగ్గురు నిందితులు వివరాలు వెల్లడించిన ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్ రెడ్డి

**ఆదిలాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

దొంగతనాల కోసం గ్యాంగ్‌ను ఏర్పాటు చేసి పదేపదే నేరాలకు పాల్పడుతున్న ఇద్దరిపై జిల్లాలో తొలిసారిగా 313 బిఎన్ఎస్ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ జీవన్ రెడ్డి వెల్లడించారు. శనివారం మావల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. చౌహాన్ రవి, సుఖ్‌దేవ్ సన్నీలు దొంగతనాల కోసం మహా రాష్ట్ర నుండి కొందరు దొంగలతో కలిసి ముఠాగా ఏర్పడి తరచూ దొంగతనాలకు పాల్పడుతున్నారని





వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టగా ప్రధాన నిందితుడైన చౌహాన్ రవి, సుఖ్‌దేవ్ సన్నీని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. వీరి వద్ద నుండి రూ.9,500 నగదు, మూడు మొబైల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో సాయి నాథ్‌ను ఇప్పటికీ అరెస్ట్ చేయగా సోహెల్, అమ్ము, కరణ్ లు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. సీఐ స్వామి, సిసి ఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్ఐ ప్రవీణ్‌ల నేతృత్వంలో ప్రధాన నిందితులను పట్టుకోవడం జరిగిందన్నారు.



## ఉగ్రరూపం దాల్చిన కుంటాల

### పర్యాటకుల సందర్శన నిలిపివేత

**నేరడిగొండ, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలతో వరద ఉధృతికి వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో జిల్లాలోని పలు జలపాతాలకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇందులో భాగంగానే నేరడిగొండ మండలంలోని కుంటాల జలపాతం ఉగ్రరూపం దాల్చింది. శనివారం భారీగా వరద నీరు జలపాతానికి చేరుకోవడంతో జలపాతం ఉధృతిగా పరవళ్ళు తొక్కుతోంది. జలపాతం వద్ద పర్యాటకుల సందర్శనను నిలిపివేశారు

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని శనివారం వన్ నేషన్ వన్ ఎలక్షన్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు అరిగేలా నాగేశ్వర్ రావు నివాసంలో శ్రీకృష్ణ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఈ పండుగ దేశవ్యాప్తంగా జరుపుకునే పవిత్ర పండుగ అని, శ్రీకృష్ణుడు చూపిన బాటలో అందరు నడిచి తమ తమ జీవితాలను ఆనందంగా తీర్చిదిద్దుకోవాలిని కోరారు. భగవద్గీతను లోకానికి ఉపదేశించి శ్రీకృష్ణుడు జగద్గురువు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ మండల అధ్యక్షుడు రవి, ఐలవేణి సంతోష్, బోయిని మల్లేష్, బండి శ్రీనివాస్, వెంకటేష్, మేకల భీమేష్, బలరాం నాయక్, మల్లేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు. కౌటాల మండలంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల్లో ఎక్కాహం భజన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలు వీధుల్లో, ఆలయ ప్రాంగణాల్లో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

## రామాలయంలో ఎక్కహం



**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని జనకాపూర్ కోదండ రామాలయంలో ఎక్కహం కార్యక్రమాన్ని భక్తులు ప్రారంభించారు. 24 గంటల పాటు నిరంతర భజన కార్యక్రమం చేపట్టనున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో 24 గంటల నిరంతర భజన కార్యక్రమంలో భాగంగా భక్తి గీతాలను ఆలపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ తిరుపతి, శంకరయ్య సాయి, గిరి పాల్గొన్నారు.

### కుమ్రం భీం, వట్టి వాగు

## ప్రాజెక్టు గేట్ల ఎత్తివేత



**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న విడతలపై లేని వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులలోకి వరద నీరు భారీగా చేరడంతో అధికారులు గేట్లు ఎత్తారు. కుమ్రం భీం ప్రాజెక్టు మూడు గేట్లు ఎత్తగా పొట్టి బాబు ప్రాజెక్ట్ రెండు గేట్లను అధికారులు ఎత్తారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.ఎడతెరిపిలేని వర్షాలతో కాలనీలు, గ్రామాలలోని రోడ్లపై వరద నీరు పారుతుంది. లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల ఇళ్లలోకి వరద నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో పల్లెలు జలమయం అయ్యాయి.పంట పొలాలలో వర్షపు నీరు నిలవడంతో రైతులు పంట ఎదుగుదలపై ఆందోళన చెందుతున్నారు.

### భారీ వర్షంతో

## నీట మునిగిన లక్షెట్టిపేట

**లక్షెట్టిపేట, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

లక్షెట్టిపేట మున్సిపాలిటీలోని బీట్ బజార్ అంకతివాడ, ఉత్కూర్‌లోని 9వ వార్డ్, ఎన్ హెచ్ 163 జాతీయ రహదారితో పాటు పలు కాలనీలు గత రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నీట మునిగాయి. కాలనీ వరద నీరు అంత ఇండ్లలో చేరడంతో ప్రజలు ఇంట్లో ఉండలేని, బయటకు వెళ్ళలేని దుస్థితి నెలకొంది. వర్షం నీరు వెళ్లేందుకు అధికారులు సరైన చర్యలు తీసుకోలేదని అందుకే ఈ పరిస్థితి వచ్చిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. దీంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్, సంబంధిత అధికారులు స్పందించి సమస్యలు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.





## నేల కూలిన భారీ వృక్షాలు

### నిర్మల్, మంచిర్యాల రాకపోకులకు అంతరాయం

**ఖానాపూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఖానాపూర్ నియోజకవర్గంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు అడవిలోని భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. శనివారం మధ్యాహ్నం నిర్మల్, మంచిర్యాల రహదారిపై కడం వద్ద భారీ వృక్షం రోడ్డు పై అడ్డంగా పడిపోవడంతో సుమారు రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న కడెం తహసీల్దార్ ప్రభాకర్ హుటాహుటిన సిబ్బందితో చెట్టు కూలిన ప్రదేశానికి చేరుకుని రంపాలు, ప్రోకలైన్లతో చెట్టును తొలగించి, రహదారి రాకపోకలను పు నరుద్ధరించారు. రహదారిపై ప్రయాణం చేస్తున్నవారు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.

## మండలంలో భారీ వర్షం



**బజార్‌హత్నూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

శుక్రవారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. పలు గ్రామాల్లో వరద నీరు ఇండ్లలో, పంట పొలాల్లో చేరింది. మండలంలోని జల్లు గూడా, మడగూడ, జాతర్ల, అందుగూడ, దేగామా తదితర గ్రామాల్లో వర్షపు నీరు ఇండ్లలో చేరింది. అంతే కాకుండా మండలంలోని కొత్తపల్లి, జవహర్ నగర్, గాంధీనగర్, గిరిజాయి, డెడ్ర, మాన్కపూర్, ఉమర్ద, కాండ్లి తదితర గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరంగా జల దిగ్బంధంగా మారాయి. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో, ఆదర్శ పాఠశాలలో వర్షపు నీరు చేరింది.



# దగ్గరుండి ప్రాణాలను రక్షించి

### ఆరుగురుని సురక్షితంగా రక్షించిన జిల్లా యంత్రాంగం - జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

### సురక్షితంగా బాధితులని రక్షించిన డిడిఆర్ఎఫ్ బృందం




**గుడిహత్నూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కారణంగా గుడిహత్నూర్ మండలం సీతగొంది గ్రామం జాతీయ రహదారి వద్ద ఓ ఇంటిలో ఉదయం నుండి గాయక్వాడ్ గణేష్ కుటుంబంలోని సభ్యులు ఆరుగురు (ముగ్గురు ఆడవారు, ఇద్దరు మగవారు, ఒక పిల్లవాడు) చిక్కుకోవడంతో, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ గారు ఘటన స్థలానికి చేరుకొని డిడిఆర్ఎఫ్ బృందాలను పిలిపి రెస్క్యూ బృందంచే చిక్కుకున్న బాధితులను సురక్షితంగా బయటకు తీశారు. వారిని వారి కుటుంబ సభ్యులకు ఆదిలాబాద్ కి సురక్షితంగా తరలించే ఏర్పాటు చేయడం జరిగింది.



### నీటి ఉధృతిని పరిశీలించి
# అధికారులకు సూచనలు చేసి
### కడెం ప్రాజెక్టు పరిశీలించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఖానాపూర్ శాసన సభ్యులు వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటి ఇన్ఫ్లో, అవుట్‌ఫ్లోపై కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. గేట్లు ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రాజెక్టు భద్రతపై ఎటువంటి లోపం లేకుండా నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వరద ముప్పు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని, కడెం ప్రాజెక్టు నుంచి విడుదల చేసే నీటిపై ప్రజలకు ముందుగానే సమాచారం చేరేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, అధికారులు సమన్వయం చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. మత్స్యకారులు, ఇతరులను ప్రాజెక్టు పరిసర ప్రాంతాలకు వెళ్లకుండా చూడాలన్నారు. అదేవిధంగా అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.





### అత్యవసర సహాయం కోసం
# టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు

**ఆదిలాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లా వ్యాప్తంగా కొన్ని ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితులు ఏర్పడుతున్న నేపథ్యంలో, ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్‌ను మున్సిపాలిటీ టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తక్షణ సహాయం, ఫిర్యాదుల పరిష్కారం కోసం క్రింది నంబర్లకు సంప్రదించవచ్చునని ఆయన సూచించారు జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్: 1800 425 1939, మున్సిపాలిటీ టోల్‌ఫ్రీ నంబర్: 94921 64153 ఈ నంబర్లకు కాల్ చేసి తమ సమస్యలను తెలియజేయడం ద్వారా వెంటనే స్పందనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఇప్పటికే ఆదేశించామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, భారీ వర్షాల నేపథ్యంలో ఎవ్వరూ అవసరం లేకుండా బయటకు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే తగిన జాగ్రత్తలతో బయటకు రావాలని సూచించారు. వర్షం తగ్గే వరకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటూ, ప్రభుత్వ సహాయ కేంద్రాల నుండి అందించే సమాచారం, సూచనల మేరకు చర్యలు తీసుకోవాలని కోరారు.

# వరద ప్రాంతాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

**కన్నెపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి నియోజకవర్గంలోని కన్నెపల్లి మండల కేంద్రంలో శనివారం కురిసిన భారీ వర్షానికి జలమయమైన ప్రాంతాలను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. వాగుల సమీపంలో ఉన్న నివాస ప్రాంతాలు వరద తాకిడికి గురయ్యాయి. భారీ వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. భారీ వర్షానికి రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ముంపుకు గురైన పంట పొలాలను సందర్శించి జరిగిన నష్టాన్ని రైతుల ద్వారా తెలుసుకున్నారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని స్థానిక బీఆర్ఎస్ నాయకులు జిల్లెల్ల మహేష్ గౌడ్ సబ్ కలెక్టర్ మనోజ్‌ను కోరారు.





### కలెక్టర్ వీడియో
# కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

**ఆదిలాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో కొనసాగుతున్న భారీ వర్షపాతం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని శనివారం నాడు జిల్లా క్యాంప్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ రాజర్షి షా గూగుల్ మీట్ వేదికగా జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు, తహసీల్దార్లు, ఇరిగేషన్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భారీ వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో నిఘా ముమ్మరం చేయాలని, అవసరమైన చోట సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. వర్షానికి ఇళ్లలోకి వరద నీరు ప్రవేశించిన గ్రామాలు, కాలనీల్లో వెంటనే నీటిని తొలగించి శానిటేషన్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, ఫీవర్ సర్వేలు నిర్వహించి తగిన వైద్య సేవలు అందించాలన్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని వైద్యాధికారి కి సూచించారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి, గ్రూపులు, మెప్మా సహకారంతో రూరల్, అర్బన్ ప్రాంతాల్లో స్నాక్స్, డిన్నర్ ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా సహాయ, సహకారాల్లో లోపం లేకుండా చూసుకోవాలన్నారు. వర్షంతో రోడ్లు, వంతెనలు దెబ్బతిన్న చోట్ల వివరాలు సేకరించి తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేయాలనీ, శాశ్వత పరిష్కారాల కోసం తగిన ఎస్టిమేట్లు పంపించాలని సూచించారు. నాలాలు, మురుగు కాలువలు శుభ్రపరచడం ద్వారా నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. ఇరిగేషన్ శాఖ అధికారులకు డ్యామ్‌లు, చెరువులు, వాగులు వద్ద నీటి మట్టాలను పర్యవేక్షిస్తూ అవసరమైన నివేదికలను సమర్పించాలన్నారు. సాత్నాల, మత్తడి వాగు, కొరాట బ్యారేజీల వద్ద నీటిమట్టం ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ఈ గూగుల్ మీట్‌లో ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, తహసీల్దార్లు, డివిజనల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాల, కళాశాలను సందర్శించిన కలెక్టర్, ఎస్పీ



**ఇచ్చోడ, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలోకి వరద నీరు చేరడంతో శనివారం జిల్లా జిల్లా పాలనాధికారి రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ శ్యామలా దేవిలు సందర్శించి పరిశీలించారు. జూనియర్ కళాశాల,పాఠశాల

### విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు

ప్రహరీ గోడ గతంలో కూలిపోవడం వలన ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షానికి వాగు ఉధృతంగా ప్రవహించడంతో ప్రహరీగోడ లేనందున స్కూల్ ఆవరణ లోనికి వర్షం నీరు రావడం జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుతం వరుణదేవుడు కరుణించడంతో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా 2వఫ్లోర్‌లోకి మార్చడం జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవలే ప్రహరీగోడ నిర్మాణానికి 60 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, వర్షాకాలం పూర్తికాగానే యుద్ధప్రాతిపదికనప్రహరీగోడను నిర్మించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమాచారం అందించాలని తహసీల్దార్ సత్యనారాయణను కలెక్టర్ ఆదేశించారు.

# స్వర్ణ ప్రాజెక్టును పరిశీలించిన నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**సారంగాపూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సందర్శించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు, ఇన్‌ఫ్లో అవుట్‌ఫ్లో పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. భారీ వర్షాలతో ప్రాజెక్టులు నిండుతున్నాయి. జిల్లాతో పాటు మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా స్వర్ణ ప్రాజెక్టుతో పాటు గడ్డనవాగు, కడెం ప్రాజెక్టుల్లో భారీగా వరద నీరు చేరుతోందని కలెక్టర్ వెల్లడించారు. దీంతో ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారని వివరించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. పశువుల కాపరులు, రైతులు, చేపలు పట్టే మత్స్యకారులు నదీ పరివాహక ప్రాంతాలకు వెళ్లకూడదని హెచ్చరించారు. ఇబ్బందులు తలెత్తితే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి. వరదల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 9100577132 సంప్రదించాలని కలెక్టర్ కోరారు. అనంతరం మలక్ చించోలి, వంజర్ గ్రామాల వాగు ప్రవాహాలను పరిశీలించి అధికారులకు, ప్రజలకు పలు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, తహసీల్దారు శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





# పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**లక్సెట్టిపేట, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో భారీ నుండి అతి భారీ వర్షాల సూచన ఉన్నందున ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, త్రాగు నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని లక్సెట్టిపేట మున్సిపల్ పరిధిలోని 9, 12, 13 వార్డులలో పర్యటించి వార్డులలో చేరిన వర్షపు నీటి స్థితిని పరిశీలించి కొత్త కొమ్ముగూడెం గ్రామంలోని చెరువు నీటి నిల్వ పరిస్థితిని మండల తహసిల్దార్ దిలీప్ కుమార్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన ప్రకారం మంచిర్యాల జిల్లాలో శనివారం రోజున రెడ్ అలర్ట్, ఆదివారం రోజున ఆరెంజ్ అలర్ట్ ఉన్నందున ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్ వే లు, వాగులు, నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్రాగునీటి సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. నివాస ప్రాంతాలలో నీటి విలువలు లేకుండా తొలగించాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కునేందుకు 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామని, ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి రిజిస్టర్లు పరిశీలించి ప్రజల తక్షణ సహాయం కొరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సిబ్బందిని నియమించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి వార్డులు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సమయపాలన పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# పిడిఎస్ బియ్యం పట్టివేత

**బెల్లంపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి రైల్వే స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి ఆర్ పిఎఫ్ పోలీసులు రైలులో అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. బెల్లంపల్లి నుండి మహారాష్ట్ర వెళ్లే అజ్ని ప్యాసింజర్ రైలులో గుర్తు తెలియని వ్యక్తులు బియ్యాన్ని తరలిస్తున్నారనే పక్క సమాచారం అందడంతో ప్యాసింజర్ రైలులో తనిఖీలు నిర్వహించినట్లు ఆర్‌పిఎఫ్ఏ ఎస్ఐ మోహన్ రాథోడ్ తెలిపారు. రామగుండం ఆర్‌పిఎఫ్ ఇన్స్పెక్టర్ లింగమయ్య ఆదేశాలతో తనిఖీలు నిర్వహించినట్లు ఏ ఎస్ ఐ మోహన్ రాథోడ్ చెప్పారు. పట్టుబడ్డ పిడిఎస్ బియ్యం విలువ రూ 18000 ఉంటుందని ఆయన చెప్పారు

# శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని బుధవార్పేట్ శిశు మందిర్‌లో శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారి విద్యార్థులు శ్రీకృష్ణుని గొల్లభాముల వేషధారణ ధరించి ముత్యాలు చేస్తూ కోలాటం చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాకులు పండరి పాఠశాల ప్రిన్సిపాల్ నరేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వరద ఉధృతి కల్వర్టులను పరిశీలించిన తాండూర్ ఎస్సై

**తాండూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాల కారణంగా వరదలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎస్సై కిరణ్ కుమార్ సిబ్బందితో కలిసి వెళ్లి వాగులు ప్రవహిస్తున్న కల్వర్టు ప్రాంతాలను పరిశీలించారు. అచలాపూర్ గ్రామంలో భావండ్ల పెల్లి నరేష్ ఇంట్లోకి వరద నీరు చేరిన దృశ్యాన్ని చూసి సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందజేశారు. భారేపల్లి గ్రామంలో హనుమాన్ దేవాలయ ప్రహరీ గోడా వరద నీటికి కొంతమేర పాక్షికంగా కూలియింది. గజ్జలపల్లి, రేచిని, బారేపల్లి గ్రామాల మధ్య గల కల్వర్టుల వద్ద భారీ వర్షాలకు అధిక నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అటువైపు వెళ్లే ప్రయాణికులు వరద నీటి ఉధృతం తగ్గిన తర్వాత వెళ్లాలని ఎస్సై సూచించారు. అత్యవసర సమయాల్లో ప్రజలు 100 నంబర్‌కు, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందిస్తే సహాయ చర్యలు చేపడుతామన్నారు.

# ఎల్లంపల్లి పరివాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



కడెం ప్రాజెక్టు వరద గేట్లు ఎత్తి దిగువ ప్రాంతానికి విడుదల చేయడం వల్ల ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీళ్లు కిందకు వదిలే అవకాశం ఎల్లంపల్లి ప్రాజెక్టు ఏఈ బుచ్చిబాబు తెలిపారు. దీని దృష్ట్యా గోదావరి నది పరివాహక ప్రాంతంలోని ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని చేపలు పట్టేవారు, పశువులు, గొర్రెలు కాసేవారు రైతులు ప్రాజెక్టు సమీప ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని కోరారు. కడెం నుంచి 22,520 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 47,941 క్యూసెక్కుల నీరు వస్తుంది. 12, 886 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.9331 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



# వరద ఉధృతిని పరిశీలించిన ఎస్పీ

**కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

కాగజ్‌నగర్ రూరల్ మండలం మెట్పల్లి వాగు వద్ద వరద ఉధృతిని ఎస్పీ కాంతిలాల్ పాటిల్ శనివారం పరిశీలించారు. వరద ఉధృతి అధికంగా ఉన్నందున మెట్పల్లి నుండి ఇతర గ్రామాల వైపుగా వెళ్లేవారు వాగును దాటే ప్రయత్నం చేయవద్దని, అక్కడ ఉన్న గ్రామస్తులకు, గ్రామపంచాయతీ సిబ్బందిని సూచించారు. ఎస్పీ వెంట కాగజ్ నగర్ డీఎస్పీ రామానుజం, కాగజ్ నగర్ రూరల్ సీఐ కుమారస్వామి పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని వర్ధంతి వేడుకలు

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని ఎమ్మెల్యే మహేష్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో బిజెపి ఆధ్వర్యంలో మాజీ ప్రధాని స్వర్గీయ అటల్ బిహారి వాజ్పేయి వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి దేశ ప్రధానిగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజు, సాయి, కార్తీక్, విజయ్, సతీష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# నార్నూర్ మండలంలో దంచికొట్టిన వాన

**నార్నూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లాలోని నార్నూర్, గాదిగూడ మండలాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురుస్తుంది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు, పొలాల్లోకి నీరు చేరి జలమయమయ్యాయి. ఈ వర్షం కారణంగా ప్రజల సాధారణ జీవితం స్తంభించింది. గాదిగూడ మండలంలోని ఖడ్కి, లోకారికే, అర్జుని, దాబా, మేడిగూడ, చిత్తగూడతో పాటు నార్నూర్‌లోని బాబేఝరి ప్రధాన రహదారులపై ఉన్న కల్వర్టుల మీదుగా వరద నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులు గమ్యస్థానాలకు చేరుకోలేక చాలా సేపు నిరీక్షించాల్సి వచ్చింది. భారీ వర్షాల కారణంగా వాగులు ఉధృతంగా ప్రవహించాయి. నార్నూర్‌లోని ముల్లంగి పంచాయతీ పరిధిలోని భారిక్‌రావుగూడ సమీపంలోని వాగు, బాబేఝరి పంచాయతీ పరిధిలోని ధాన్యం గూడ, అలాగే గాదిగూడ మండలంలోని అర్జుని పంచాయతీ పరిధిలోని మారుగూడ, కునికసా గ్రామాలకు సమీపంలో ఉన్న వాగులు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తమకు సహాయం అందడం కష్టమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని నార్నూర్ సీఐ పేందూర్ ప్రభాకర్ సూచించారు. ఏదైనా సమస్య ఎదురైతే నేరుగా సంబంధిత శాఖ అధికారులకు లేదా పోలీస్ శాఖకు సమాచారం అందించాలని ఆయన కోరారు. లోకారికే కల్వర్టు వద్ద వరద ప్రవాహం ఉధృతంగా ఉండటంతో గాదిగూడ పోలీసులు అక్కడ హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే, వర్షాల కారణంగా చెరువులు, జలపాతాల వద్దకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు. చేపల కోసం ప్రాణాలకు తెగించి సాహసాలు చేయవద్దని కూడా సూచించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు రాబోయే మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు కోరారు.








# కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

## ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌కు వినతి

**జన్నారం, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

గల్ఫ్ కార్మికుల కోసం గల్ఫ్ సంక్షేమ బోర్డు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని గల్ఫ్ సంక్షేమ సమితి ఆధ్వర్యంలో శనివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందని సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు కల్లెడ భూమన్న తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం గల్ఫ్ కార్మికుల సంక్షేమం కోసం ఇటీవల అమలు చేసిన పలు కార్యక్రమాలు, అడ్వైజర్ కమిటీ వేసిన తెలంగాణ ప్రభుత్వం కు సీఎం రేవంత్ రెడ్డికి తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. తొందరగా గల్ఫ్ బోర్డ్ ప్రకటించేలాగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ కృషి చేయాలని వినతిపత్రం అందజేశమని అన్నారు. అందులో గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి కుటుంబాల ఆర్థిక భద్రతకు ప్రత్యేకంగా "గల్ఫ్ సంక్షేమ బోర్డు" ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. 2024 ముందు గల్ఫ్‌లో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు మృత ధన సహాయం అందేలాగా చూడాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉచిత వైద్యసేవలు అందించాలని అన్నారు. తిరిగి వచ్చిన కార్మికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, తప్పకుండా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీ షెషన్ లో కార్మికుల తరపున నా వాయిస్ వినిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు శేపూరు గోపాలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పెరుగు మల్లికార్జున్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహమ్మద్ హసన్, జిల్లా ఇంచార్జ్ పెట్టం రమేష్, జిల్లా అధ్యక్షులు ఎరుకల రమేష్ గౌడ్, మండల అధ్యక్షులు మగ్గిడి తిరుపతి, మండల ప్రధాన కార్యదర్శి దుమల్ల ఎల్లయ్య రెడ్డి, మండల నాయకులు వేముల నాగేష్, మెరుగు సత్తి గౌడ్ కొండూకూరి ప్రశాంత్, నగేష్, ముదుగుట్ల శేఖర్, కుదురుపాక రాజన్న, సంపత్, మల్లేష్, గంగాధర్, సాట్ల సత్యం, మల్లేష్, వివిధ గ్రామ నాయకులు, పాల్గొన్నారు.

## ఎల్లంపల్లి ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తిన అధికారులు

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా గుడిపేట మండలంలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో పెరుగుతుండటంతో ప్రాజెక్టు 20 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు లెవల్ 148 మీటర్లు కాగా 147.12 మీటర్లకు నీరు చేరుకుంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 20.175 టీఎంసీలకు 17.7303 టీఎంసీల నీరు నిలిచి ఉంది. ఎగువన కురిసిన వర్షాలతో వరద రూపంలో ప్రాజెక్టుకు 54,366 క్యూసెక్కులు, కడెం ప్రాజెక్టు గేట్లు ఎత్తడంవల్ల 1,61,135 క్యూసెక్కుల నీరు వస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సాయంత్రం 10 గేట్లు ఎత్తిన అధికారులు, ప్రస్తుతం 20 గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి మూడు లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్టు దిగువన ఉన్న గోదావరి తీర ప్రాంత ప్రజలను పోలీసులు, రెవెన్యూ అలర్ట్ చేశారు.



## పిడుగుపాటుతో యువకునికి గాయాలు



**కన్నెపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

కన్నెపల్లి మండల కేంద్రంలో శనివారం కురిసిన భారీ వర్షానికి పిడుగు పడింది. కొట్రంగి మహేష్ అనే యువకుడి ఇంటి ఆవరణలో పిడుగుపడడంతో అక్కడే ఉన్న మహేష్ స్పృహ తప్పి కిందపడిపోయాడు. కొద్దిసేపటి తర్వాత లేచి చూసేసరికి అతని చేతికి బొబ్బలు రావడం గమనించాడు. మహేష్ తృటిలో పిడుగుపాటు నుండి తప్పించుకోవడం పట్ల అతని కుటుంబ సభ్యులు ఊపిరిపించుకున్నారు.

## వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన డీసీపీ

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

వరుసగా కురుస్తున్న వర్షాల వల్ల వరద ప్రభావిత ప్రాంతాలను మంచిర్యాల డీసీపీ శనివారం పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. మంచిర్యాలలోని రాళ్లవాగుతో పాటు లక్సెట్టిపేట్ పరిధిలోని గంపలపల్లి, కొమ్ముగూడెం గ్రామాలను, గోదావరి నది పరివాహక ప్రాంతాలను, చెరువులు, వాగులు, వంతెనలు, ప్రధాన రహదారులను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

**అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100...**

వర్షాలు భారీగా కురుస్తుండటంతో అత్యవసర సహాయం కోసం ప్రజలు 100 నంబర్‌కు డయల్ చేసి సహాయం పొందవచ్చునని మంచిర్యాల డీసీపీ ఎగ్గిడి భాస్కర్ పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వివిధ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. వర్షాల ప్రభావం, వరద పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, వివిధ గ్రామాలకు అనుసంధానంగా ఉన్న కల్వర్టులు,



బ్రిడ్జిలు నీట మునిగే ప్రమాదమున్నందున, వరద నీటి ఉధ్రుతిని అంచనా వేయకుండా నదులు, వాగులు, కాలువలు, కుంటలు దాటే ప్రయత్నం చేయకూడదని సూచించారు. డీసీపీ వెంట మంచిర్యాల పట్టణ సిఐ ప్రమోద్ రావు, లక్సెట్టిపేట సిఐ రమణమూర్తి, ఎస్ఐ సురేష్ తదితరులున్నారు.



## మంచిర్యాల జిల్లాలో 53 మిల్లీ మీటర్ల వర్షపాతం

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కురిసిన వర్షానికి జిల్లాలోని పలు కాలనీలు, గ్రామాలు జలమయమయ్యాయి. వాగులు ఉప్పొంగాయి. జిల్లా వ్యాప్తంగా 53 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయ్యింది. జన్నారం మండలంలో 54.2 మిల్లీ మీటర్లు, దండేపల్లిలో 32.8 మిల్లీ మీటర్లు, లక్సెట్టిపేటలో 56.7 మిల్లీ మీటర్లు, హాజీపూర్ లో 44.4 మిల్లీ మీటర్లు, కాసిపేటలో 52.1 మిల్లీ మీటర్లు, తాండూరులో 15.8 మిల్లీ మీటర్లు, భీమినిలో 9.7 మిల్లీ మీటర్లు, కన్నెపల్లిలో 31.5 మిల్లీ మీటర్లు, వేమనపల్లిలో 84.5 మిల్లీ మీటర్లు, నెన్నెలలో 74.9 మిల్లీ మీటర్లు, బెల్లంపల్లిలో 40.5 మిల్లీ మీటర్లు, మందమర్రిలో 52.1 మిల్లీ మీటర్లు, మంచిర్యాలలో 38.2 మిల్లీ మీటర్లు, నస్పూర్‌లో 38.4 మిల్లీ మీటర్లు, జైపూర్ లో 61.1 మిల్లీ మీటర్లు, భీమారంలో 54.3 మిల్లీ మీటర్లు, చెన్నూర్‌లో 74.3 మిల్లీ మీటర్లు, కోటపల్లిలో 98.1 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఈ ఏడాది జూన్ నుంచి నేటి వరకు జిల్లాలో 626.2 మిల్లీ మీటర్ల వర్షం కురి తయాల్సి ఉండగా 536.5 మిల్లీ మీటర్లు మాత్రమే కురిసింది. ఇంకా 14 శాతంలోటు వర్షపాతమే నమోదైంది.

## ఉప్పొంగిన బుగ్గ చెరువు

### నలుగురు యువకులను కాపాడిన స్థానికులు

**కాసిపేట, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

శనివారం కురిసిన భారీ వర్షానికి కాసిపేట మండలంలోని బుగ్గ చెరువు మత్తడి ఉప్పొంగింది. మత్తడి వద్ద చేపలు పట్టేందుకు వెళ్లిన నలుగురు యువకులు వరద ప్రవాహంతో మత్తడి ఒడ్డు వద్దే చిక్కిపోయారు. ఇది తెలుసుకున్న స్థానికులు అక్కడికి చేరుకునేసరికి వరద పెరిగిపోయింది. నలుగురు యువకులు అవతలి ఒడ్డున ఉండటాన్ని చూసి తాళ్ళ సహాయంతో ఒడ్డుకు చేర్చారు. నలుగురు యువకులు ప్రాణాలతో బయటపడ్డారు.



# నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి ,ఉత్పాదకత లక్ష్యాలను సాధించాలి

## మల్టీ డిపార్ట్ మెంటల్ కమిటీ సమీక్ష సమావేశం

**బెల్లంపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఆదేశాల అనుసారం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో మల్టీడిపార్ట్ మెంటల్ బృందాలు పర్యటించి సమీక్షలు చేస్తున్నాయి. అందులో భాగంగా శనివారం మందమర్రి ఏరియాలోని శాంతిఖనిలో ఏరియ జనరల్ మేనేజర్ జి.దేవేందర్ కమిటీ చైర్మన్, కమిటీ సభ్యులైన విజయ్ ప్రసాద్ (ఎస్.ఓ.టు జి.ఎం), బాలాజీ భగవతిజా (డి.జి.ఎం.ఈఅండ్ఎం), ఆర్.వి.ఎస్.ఆర్.కే ప్రసాద్ డి.జి.ఎం.ఎస్. శ్యాంసుందర్ (పర్సనల్ మేనేజర్) కె. కిరణ్ కుమార్, ఎస్.ఇ, బృందం పర్యటించింది. మొదటి, రెండవ మూడవ షిఫ్ట్ లలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు నిర్వహించారు. సమావేశంలో కంపెనీ నిర్దేశించిన ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్యాలను సాధించిన విషయాలను, భూగర్భ ఓపెన్ కాస్ట్ గనులలో యంత్రాల వినియోగం సింగరేణిలో అమలు చేస్తున్న సంక్షేమ ఫైనాన్స్ విషయాలను విపులంగా చర్చించారు. అదేవిధంగా కంపెనీ భవిష్యత్తు ప్రణాళికలు, కంపెనీ ముందున్న సవాళ్లను కంపెనీ లక్ష్యాలను సాధించడానికి చేయాల్సిన పనులపై అవగాహన కల్పించారు. గని ఉద్యోగస్తులు కంపెనీకి సూచించిన సలహాలు సూచనలు పాటించడం వల్ల ఉత్పత్తి ఉత్పాదకత పెరుగుతుందని వివరించారు. అందరూ నిబద్ధతతో తమకు కేటాయించిన పనులను చేయడం వలన అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామన్నారు. ఉద్యోగులు కార్మికులు పనితనాన్ని మెరుగుపరచుకోవడం వలన లక్ష్య సాధన సులువు అవుతుందన్నారు. బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ మల్లేష్, ఎస్.కె గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదిర్, శాంతి ఖనిగని మేనేజర్ సంజయ్ కుమార్, సంక్షేమ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.





ప్రేమ విఫలం కావడం, కుటుంబ కలహాలు, చదువులో రాణించకపోవడం, ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడం.. తదితర కారణాలతో ఎంతోమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. వారి సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం చూపక పోగా.. వారి పిల్లలు, కుటుంబ సభ్యులు అనాథలుగా మారుతున్నారు. ఒక్క క్షణం ఆలోచించగలిగితే ఆత్మహత్య ఆలోచనలను దూరం చేసుకోవచ్చు. అన్ని సమస్యలకు సూసాడ్ అనేది పరిష్కార మార్గం కాదు. పైగా తమవారిని, తమను నమ్ముకున్న వారిని మరింత కష్టాల్లోకి నెడుతుంది.

# సూసైడ్!
## కాదు పరిష్కారం

- మానసిక ఆందోళనలో యువతరం
- ఆలోచనలను దూరం చేస్తున్న సెల్ ఫోన్ గేమ్స్
- ప్రేమలు, చిన్న చిన్న తగాదాలతో మనస్తాపం
- ఏ చిన్న సమస్యను తట్టుకోలేని టెంపర్‌మెంట్
- పేరెంట్స్‌తో అటాచ్‌మెంట్ తగ్గడంతోనే సమస్య
- టీనేజ్‌లో పెరుగుతున్న ఆత్మహత్యలపై ఆందోళన



ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి ఫేస్‌బుక్‌లో పరిచయం చేసుకున్నాడు. మాయమాటలతో అభం శుభం తెలియని భాలికను ట్రాప్ చేశాడు. అతని మాటలు నమ్మిన ఆ మైనర్ ఇంట్లో నుంచి పారిపోయింది. దీంతో ఆమె తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. 1

మహబూబాబాద్ జిల్లాలోని ఓ మండలానికి చెందిన తొమ్మిదేండ్ల బాలుడికి ఆన్‌లైన్ క్లాసుల కోసం తండ్రి సెల్‌ఫోన్ కొనిచ్చాడు. దానికి బ్యాంక్ అకౌంట్ లింక్ చేసి.. వద్దు అమ్మగా వచ్చిన రూ.2 లక్షలు ఇంటర్‌నెట్ బ్యాంకింగ్‌తో తండ్రి అకౌంట్ నుంచి పోగొట్టాడు. 2

సూర్యాపేటలో ఈ మధ్యనే ఓ డిగ్రీ స్టూడెంట్ సూసైడ్ చేసుకున్నాడు. తల్లిదండ్రులు టెంపుల్‌కు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని టైమ్‌లో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు. గుడి నుంచి వచ్చిన పేరెంట్స్ కొడుకు మృతదేహం చూసి కన్నీరుమున్నీరయ్యారు. 3

రంగారెడ్డి జిల్లా మీర్‌పేట సర్వోదయ నగర్‌లో మరో ఘటన జరిగింది. తండ్రి మందలించాడని పదో తరగతి చదివే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మొబైల్ ఫోన్‌లో గేమ్స్ ఆడుతుంటే వద్దని వారించినందుకు మనోవేదనతో ప్రాణాలు తీసుకున్నాడు. 4

...ఇవే కాకుండా సెల్ఫీలు దిగుతూ ప్రమాదాలకు గురై చాలా మంది చనిపోతున్నారు. చిన్న చిన్న కారణాలతో ఆత్మహత్య చేసుకుని.. తల్లిదండ్రులకు, అయినవారికి కడుపుకోత మిగుల్చుతున్నారు.



### పెరిగిన యువత ఆత్మహత్యలు

ఆధునిక జీవన విధానంలో పిల్లలపై తల్లిదండ్రుల ప్రేమ, ఆప్యాయతలు కొరవడటం, వారి కోసం సరైన సమయాన్ని వెచ్చించలేకపోవడం, పిల్లలు ఏమి చేస్తున్నారో పట్టించుకునే సమయం లేకపోవడంతో చాలామంది మానసిక సంఘర్షణకులోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది. ఈ మధ్య కాలంలో టీనేజ్, 18 నుంచి 29 సంవత్సరాల వయస్సు వారే ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు క్రైం రికార్డుల ద్వారా వెల్లడవుతోంది. రోడ్డు యాక్సిడెంట్ల మరణాల తర్వాత రెండో స్థానంలో సూసైడ్స్ ఉంటున్నాయి. తాజాగా ఆన్‌లైన్‌కు బానిసలై ఆత్మహత్యలకు పాల్పడుతున్న కేసులు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నమోదవుతున్నాయి.



### సంకేతాలు తెలుసుకోవచ్చు..

ఆత్మహత్యకు పాల్పడాలనుకునే వారిని ముందుగా గుర్తించవచ్చంటున్నారు మానసిన నిపుణులు. డల్‌గా ఉండటం, ఇతరులతో కలవకపోవడం, ఏకాంతంగా గడపడం, ఆకలి, నిద్ర లేకపోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించక పోవడం.. విషాద భరితమైన సీరియల్స్ చూడటం, జోక్స్ వచ్చినా స్పందించక పోవడం వంటి లక్షణాలు ఉంటాయని చెబుతున్నారు. అలాంటి వారు తమ మనస్సులోని బాధను ఎదుటి వారితో చెప్పుకోవడం ద్వారా కొంత ఉపశమనం కలుగుతుందంటున్నారు. "నాకు చనిపోవాలని ఉంది.. ఈ జీవితం ఎందుకు.. ఏమీ సాధించలేక పోతున్నా" అని సన్నిహితుల వద్ద పదేపదే అనడం. ఆల్కహాల్ ఎక్కువగా సేవించడం, ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ చెట్టుకు ఢీకొట్టడం వంటివి చేస్తుంటారని చెపుతున్నారు.

### యువతలో సమస్యలు

గతంలో 40 సంవత్సరాల వయస్సు పైబడిన వారు ఆర్థిక ఇబ్బందులు, ఇతర కారణాలతో ఆత్మహత్యలకు పాల్పడే వారు. కానీ, నేడు ప్రేమ విఫలమవడం.. చదువులో రాణించలేక పోవడం.. మానసిక ఒత్తిడి.. నవ దంపతుల్లో సర్దుబాటు సమస్యలు వంటి కారణాలతో యువతీ, యువకులు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

### మానసిక ఆందోళన

ఆత్మహత్య ఆలోచన.. ఒక మానసిక సమస్యే అంటున్నారు డాక్టర్లు. అట్లాంటి వారికి జీవితం విలువ తెలియజేయాలి. చనిపోయేందుకు దారికాదు... బతికేందుకు మార్గం చూపించాలంటున్నారు. స్టూడెంట్స్ సూసైడ్‌కు దారితీసే పరిస్థితులను అధిగమించేలా స్కూళ్లు, కాలేజీల్లో కౌన్సెలింగ్ సెంటర్ల వంటివి ఏర్పాటు చేస్తే మేలంటున్నారు మానసిక వైద్య నిపుణులు.

### టీనేజ్‌లోనే ఫోన్‌కు బానిసలు

ఓ కుటుంబం హోటల్లో డిన్నర్‌కు వెళ్లింద నుకోండి. అక్కడ సహజంగా తల్లిదండ్రులు చేసే పని ఏంటంటే.. ఆర్డర్ చేసిన ఫుడ్ వచ్చే దాకా సెల్ ఫోన్లు తీసి చూసుకోవడం. అలాగే, పక్కనున్న పిల్లలకు కూడా ట్యాబ్‌లు ఇచ్చేస్తారు. అందులో ఓ వీడియోనో, లేకపోతే ఏదైనా గేమ్ ప్లే అవుతూ ఉంటుంది. కొన్ని సార్లు భోజనం చేసేటప్పుడు కూడా సెల్ ఫోన్‌ను పదే పదే చూస్తుంటారు. తినేటప్పుడు పిల్లల దగ్గరి నుంచి సెల్‌ఫోన్ తీసుకోవడానికి ట్రై చేస్తే.. వారు గోల గోల చేసేస్తారు. ఇది కచ్చితంగా తల్లిదండ్రులదే తప్పు. పిల్లలకు టైంపాస్ కావడానికి ఎలక్ట్రానిక్ వస్తువులు ఇవ్వడంలో తల్లిదండ్రుల అలసత్వం ఉంది. (దాన్ని డిపెండెన్సీ సిండ్రోమ్ అంటారు) ఇది హోటల్‌కే పరిమితం కాదు.. చాలా మంది ఇండ్లలోనూ ఇదే పరిస్థితి ఎదురవుతూ ఉంటుంది.



# కడెం ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తివేత

**ఖానాపూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లాలో గత రాత్రి నుండి భారీగా వర్షాలు కురువడంతో జిల్లాలోని కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరుతుంది. నీటిపారుదల శాఖ అధికారులు శనివారం కడెం ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తి దిగువ ప్రాంతమైన గోదావరిలోకి 1,56,376 క్యూసెక్కుల వరద నీటిని అధికారులు వదిలారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 692.425 క్యూసెక్కుల, 700 అడుగులు, 3.533/4.699 టీఎంసీలు ఉండగా ప్రాజెక్ట్ పై భాగమున భారీగా వర్షాలు కురవడంతో ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా చేరుతుందని, ప్రాజెక్ట్ లోకి ఇన్ ఫ్లో 11,2342 క్యూసెక్కుల వరద నీరు చేరుతుందని అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం నీటిమట్టం 37,2000 క్యూసెక్కులు, 68,150 టీఎంసీలు నీటిమట్టం ఉందని, ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో కడెం ప్రాజెక్టుకు 18 గేట్లు ఉండగా 16 గేట్లు ఎత్తి కింది భాగానికి అవుట్ ఫ్లో 1,49,459 క్యూసెక్కుల వరద నీటిని దిగువ భాగమైన గోదావరిలోకి వదిలినట్లు అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టుకు ఉన్న ఎడమ కాలువ నుండి 457 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ నుండి 20 క్యూసెక్కుల నీటిని వదిలారు. గోదావరి నది తీర ప్రాంతంలో ఉన్న ప్రజలు, పశువుల కాపరులు, గొర్రెల కాపారులు, రైతులు, చేపలు పట్టేవారు గోదావరి నదిలోకి వెళ్లకూడదని అధికారులు హెచ్చరించారు. ప్రాజెక్టుకు చేరుతున్న వరద నీటి ఉధృతిని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నట్లు నీటిపారుదల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాథోడ్ విట్టల్ తెలిపారు.



## గడ్డెన్నవాగు ప్రాజెక్టు
# ఐదు గేట్లు ఎత్తివేత

**ముధోల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో ముధోల్ తాలూకాలోని భైంసా, ముధోల్, కుంటాల, కుబీర్, తానూర్, లోకేశ్వరం, బాసర మండలాల్లో వర్షం విస్తారంగా కురుస్తోంది. పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్ట్‌లో భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో అధికారులు ఐదు గేట్లు వదిలి నీటిని దిగువకు విడుదల చేశారు. శుక్రవారం ప్రాజెక్టు వరద గేట్లలో రెండు గేట్లను ఒక ఫీట్ మేర ఎత్తగా, శనివారం కురుస్తున్న విస్తార వర్షాలకు ప్రాజెక్టులో నీటి స్థాయి మొత్తం పెరగడంతో మధ్యాహ్నం ఐదు గేట్లు తెరిచారు. అవసరం ఉంటే తప్ప ప్రజలు బయటకు వెళ్లొద్దని, ప్రాజెక్టు దిగువ పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కాగా ఇప్పటికే 10500 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్ట్‌లో చేరగా, 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

**లోతట్టు ప్రదేశాలకు వెళ్లవద్దు...**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కడెం, స్వర్ణ ప్రాజెక్టుల పరిసరాలకు ఎవరూ వెళ్లరాదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రదేశాలకు ఎవరూ వెళ్లవద్దని, ముఖ్యంగా పశువుల కాపరులు తమ పశువులను నది, వాగుల దారుల్లోకి తీసుకెళ్లకూడదని కలెక్టర్ సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణలో భాగంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కడెం, స్వర్ణ ప్రాజెక్ట్ గేట్లు ఎత్తిన నేపథ్యంలో దిగువ గ్రామాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని స్పష్టం చేశారు. నదీ పరివాహక ప్రాంతాల్లోకి చేపలు పట్టేవారు, రైతులు, వెళ్లకూడదని హెచ్చరించారు.

# హైవోల్టేజీతో ఏసీలో చెలరేగిన మంటలు

**జన్నారం, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



మండల కేంద్రంలో శనివారం మధ్యాహ్నం ఏసీలో నుంచి మంటలు చెలరేగి పెనుప్రమాదం తప్పింది. శనివారం కురుస్తున్న భారీ వర్షానికి సతీష్ గౌడ్ ఇంటి సమీపంలో పిడుగు పడింది. దీంతో సతీష్ గౌడ్ ఇంట్లో ఉన్న ఏసీకి హై పవర్ రావడంతో ఏసీ నుంచి మంటలు చెలరేగడంతో కానిస్టేబుల్ శ్రీనివాస్, ఫైర్ సిబ్బందితో కలిసి చాకచక్యంగా వ్యవహరించి మంటలను ఆర్పివేశారు. కానీ, అప్పటికే ఇంట్లో ఉన్న వస్తువులు కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని జన్నారం తాహసిల్దార్ రాజ మనోహర్ రెడ్డి సందర్శించారు. మొత్తం రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక అధికారి రవీందర్ రెడ్డి తెలిపారు. ప్రమాద సమయంలో వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేసిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను పలువురు అభినందించారు.

# భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్డు.. రాకపోకలకు తీవ్ర ఆటంకం

**ఇంద్రవెల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



అల్పపీడనం ప్రభావంతో మండల వ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. కొన్ని గ్రామాలకు రోడ్డు రవాణా వ్యవస్థపై, పంట సాగు పై ప్రభావం చూపింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాగులు, వంకలు సరస్సులు చెరువులు పొంగిపొర్లుతున్నాయి. శనివారం కురిసిన భారీ వర్షానికి మండలంలోని ముత్నూర్ త్రివేణి సంగం కాలువ ఉప్పొంగి పోర్లడంతో సమీపంలో గల ఉట్నూర్, ఆదిలాబాద్ వెళ్లే రోడ్డును అనుకోని ప్రవహించడంతో రోడ్డు చాలా వరకు తెగిపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సిబ్బంది వెంటనే అక్కడకి చేరుకుని ఎక్కడికక్కడే రాకపోకలను ఆపివేసి ఎలాంటి సంఘటనలు జరగకుండా భద్రత ఏర్పాటు చేశారు. అనంతరం తాత్కాలిక రోడ్డు మరమ్మతులు చేపట్టడంతో రాకపోకలు కొనసాగాయి. ఈ అల్పపీడన ప్రభావంతో కొన్ని చోట్ల పంట సాగు పై కూడా ప్రభావం ఏర్పడి చాలా వరకు దెబ్బ తీసింది.

## జన్నారం మండల సీనియర్ సిటిజన్స్ కమిటీ

**జన్నారం, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



జన్నారం మండల సీనియర్ సిటిజన్స్ కమిటీని మండల సీనియర్ సిటిజన్స్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సైన్ల మొండయ్య ఆధ్వర్యంలో ఏకాగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా గోపి, సత్యనారాయణ ఉపాధ్యక్షులుగా పిట్ట రాజారావు, వి రామకృష్ణ ప్రధాన కార్యదర్శి దుర్గం, రాజలింగం, సహాయ కార్యదర్శి బిగ్రాబ్రియల్, కోశాధికారి యాడ పుల్లయ్య, కార్యవర్గ సభ్యులుగా మోట పలుకుల రాజలింగయ్య, కాసు లచ్చయ్య, లచ్చన్న, తిరుపతిరెడ్డిని ఎకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు అద్దగురి భూమన్న, ప్రధాన కార్యదర్శి కస్తూరి, నాగేశ్వర్, మూల భాస్కర్, గౌడ్ గుర్రాల, మురళి ఇతర సీనియర్ సిటిజన్స్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### కడెం ప్రాజెక్టు పరిశీలించిన కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం సాయంత్రం కడెం ప్రాజెక్టును అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీరు, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను కలెక్టర్ అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎగువ నుండి ప్రాజెక్టులోకి వస్తున్న వరద నీటిని నిరంతరం పరిశీలించాలని సమీప ప్రాంతాల ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తిన నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అధికారులు నిరంతరం 24 గంటలపాటు అప్రమత్తంగా పనిచేస్తున్నారని, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తిన, అత్యవసర సమయాల్లో ప్రజలు కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ నంబర్‌ను 9100577132 సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు విట్టల్, తహసిల్దార్ ప్రభాకర్, ఎంపీడీవో అరుణ, అధికారులు, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య
# ఇంట్లో తప్పిన ప్రమాదం

**బెల్లంపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసి ఏరియాలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య నివాసం ఉంటున్న సింగరేణి క్వార్టర్స్‌లో శనివారం మధ్యాహ్నం స్టోర్ రూమ్, డైనింగ్ హాల్‌లోని స్లాబ్ పెచ్చులు ఊడి కింద పడ్డాయి. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది.





# ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం.. కూలిన ఇల్లు

**బెజ్జూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని బెజ్జూర్, పెంచికలపేట, చింతలమానపెల్లి మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం వరకు కురిసిన భారీ వర్షాలకు అతలాకుతలమైంది. బెజ్జూర్ లో భారీ వర్షానికి శనివారం ఓ ఇల్లు కూలిపోయింది. బెజ్జూర్ మండలం హేటి గూడెం గ్రామానికి చెందిన పంబాల సన్యాసి ఇల్లు పూర్తిగా కూలిపోయింది. ఇంట్లోని ధాన్యం తడిసి ముద్దయినట్లు బాధితుడు తెలిపారు. ఆర్థిక సహాయం అందించాలని తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు. సంఘటన స్థలాన్ని శనివారం బెజ్జూర్ ఎస్సై సర్తాజ్ పాషా, జూనియర్ అసిస్టెంట్ జావీద్ కంప్యూటర్ ఆపరేటర్ భీమ్ రావులు సందర్శించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. బెజ్జూర్ మండలంలోని సుష్మీర్ వాగు పొంగిపొర్లి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో 12 గ్రామాల ప్రజలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దహెగాం మండలంలోని అయినం గ్రామం వద్ద వరద నీరు ప్రవహిస్తుంది. లో లెవెల్ వంతెన నీరు ప్రవహించడంతో దహెగాం, కాగజ్ నగర్ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.. వాగులపై వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



# మెగాస్టార్ బర్త్ డేకు బిగ్ ట్రీట్

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా మూడు సినిమాలకు సంబంధించిన అప్ డేట్స్ వస్తాయని అంతా ఎదురు చూస్తున్నారు. అవి ఏ రూపంలో ఎలా? ఉంటాయన్నది గెస్ చేయలేదు గానీ..అభిమానులకు మాత్రం బిగ్ ట్రీట్ లాగే ఉంటుందని భావిస్తున్నారు. తాజాగా అభిమానుల అంచనాలు నిజమయ్యేలా ఉన్నాయి. అభిమానులు కోరుకుంటున్నట్లు మూడు అప్ డేట్స్ తో మెగాస్టార్ ముందుకు రావడానికి రెడీ అవుతున్నట్లు తెలిసింది. 'విశ్వంభర' చిత్రానికి సంబంధించి టీజర్ రిలీజ్ చేయాలని దర్శకుడు వశిష్ట ముహూర్తం ఫిక్స్ చేసినట్లు తెలిసింది. అదో రోజు రిలీజ్ తేదీ కూడా ప్రకటించబోతున్నారుట. మేకర్స్ డేట్ పై ఈనెల 20 వ తేదీలోగా నిర్ణయం తీసుకుంటారని అత్యంత సన్నిహిత వర్గాల నుంచి వినిపిస్తుంది. విశ్వంభరకు సంబంధించి ఈ రెండు తప్పని సరిగా ప్రకటించాలని మేకర్స్ స్ట్రాంగ్ గా ఫిక్సైనట్లు తెలుస్తోంది. అలాగే అనీల్ రావిపూడి దర్శకత్వంలో చిరంజీవి 157వ సినిమా ఆన్ సెట్స్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఈ సినిమా లో చిరంజీవి లుక్ పై ఆద్యంతం ఆసక్తి నెలకొంది. ఇప్పటికే చిరంజీవి స్లిమ్ లో ఆకట్టుకుం టున్నారు. దీంతో 157 లుక్ పై సస్పెన్స్ కొనసాగుతోంది. అదే రోజు టైటిల్ కూడా ప్రకటిస్తారని సమాచా రం. సినిమా మొదలవ్వడానికి ముందే బోలెడంత హడావుడి చేసిన అనీల్ రావిపూడి అన్నయ్య బర్త్ డేకి హడావుడి చేయకుండా ఉంటాడా? అని అభిమానులు ఎంతో నమ్మకంతో ఎదురు చూస్తు న్నారు. ప్రస్తుతం చిరంజీవి ఈ రెండు సినిమా పనుల్లోనే బిజీగా ఉన్నారు. విశ్వంభర చిత్రానికి సంబంధించి డబ్బింగ్ చెబుతున్నారు. ఈ సినిమా సీజీ వర్క్ వేగంగా జరుగుతోంది. ఆ పనులతో పాటు వశిష్ట డబ్బింగ్ పనులు చూస్తున్నాడు. 157వ సినిమా షూటింగ్ లో కూడా చిరంజీవి పాల్గొంటున్నారు. ఇప్పటికే కొంత భాగం షూటింగ్ పూర్తైన సంగతి తెలిసిందే. జనవరిలో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలన్నది టార్గెట్.



# లోకేష్ ఓవర్ రేటెడ్ ?

లోకేష్ కనకరాజ్.. చాలా తక్కువ సమయంలో సౌత్ ఇండియన్ టాప్ డైరెక్టర్లలో ఒకడైపోయాడు. తన తొలి చిత్రం 'మానగరం' హిట్టయినా అతడికి గొప్ప పేరేమీ రాలేదు. కానీ 'ఖైదీ' సినిమాతో తన కెరీర్ మారిపోయింది. ఆ సినిమా పెద్ద హిట్టయి.. ఏకంగా విజయ్‌తో 'మాస్టర్' లాంటి పెద్ద సినిమా చేసే అవకాశం దక్కించుకున్నాడు.ఆ సినిమా నిరాశపరిచింది. కానీ లోకేష్ నాలుగో చిత్రం 'విక్రమ్' సంచలన విజయం సాధించి తనను ఒకేసారి టాప్‌లో తీసుకెళ్లి కూర్చోబెట్టేసింది. కోలీవుడ్లో చాలామంది సీనియర్ డైరెక్టర్లు డౌన్ అయిపోయి, కొత్త తరం దర్శకుల పెర్ఫామెన్స్ అంతంతమాత్రంగా ఉన్న సమయంలో లోకేష్ అసాధారణమైన క్రేజ్ సంపాదించుకున్నాడు. 'ఖైదీ'కి 'విక్రమ్'కు లింక్ పెట్టి 'లోకేష్ సినిమాటిక్ యూనివర్స్' అంటూ కొత్త ట్రెండ్ మొదలుపెట్టడంతో తన క్రేజ్ ఎక్కడికో వెళ్లిపోయింది. ఎల్‌సీయూ.. ఎల్‌సీయూ.. అంటూ జనం ఊగిపోవడం మొదలుపెట్టారు. తెలుగు ప్రేక్షకులు సైతం దీనికి ఎగ్జైట్ అయి లోకేష్‌కు ఎక్కడ లేని హైప్ ఇవ్వడం మొదలుపెట్టారు. కట్ చేస్తే.. లోకేష్ తర్వాతి చిత్రం 'లియో' ప్రేక్షకుల తలలు బొప్పి కట్టేలా చేసింది. ప్రోమోలు చూస్తే గొప్పగా అనిపించాయి కానీ.. సినిమాలో విషయం లేక అది బోల్తా కొట్టింది. లోకేష్ ఓ హాలీవుడ్ మూవీని కాపీ కొట్టి ఈ సినిమా తీయడం గమనార్హం. 'లియో'ను ఒక మిస్టేక్‌గా భావించి.. లోకేష్ కొత్త చిత్రం 'కూలీ'కి మళ్లీ హైప్ ఎక్కించుకున్నారు జనం. ఈ మధ్య కాలంలో ఏ సినిమాకూ రానంత బజ్ క్రియేట్ అయిందీ సినిమాకు. ఎంతో ఊహించుకుని సినిమాకు వెళ్లిన జనాలకు మరోసారి షాక్ తప్పలేదు. ఈ సినిమా గురించి.. ఇందులో పాత్రల గురించి లోకేష్ సహా టీం అంతా చెప్పిన మాటలకు.. సినిమాలో ఉన్నదానికి అసలు పొంతన లేదు. ఈ కథతో అసలేం చెప్పాలనుకున్నారో అర్థం కాలేదు. ఒక్క పాత్రనూ సరిగా తీర్చిదిద్దలేదు. ఎంతో హైప్ ఇచ్చిన నాగ్ క్యారెక్టర్ గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది. సినిమాలో లాజిక్‌కు అందని విషయాలు.. నాన్సెన్స్ అనిపించిన సన్నివేశాలు ఎన్నెన్నో. సన్నివేశంలో ఏమీ ఉండదు. ఊరికే టేకింగ్‌తో, బ్యాగ్రౌండ్ స్కోర్‌తో బిల్డప్ ఇచ్చి ప్రేక్షకుకు మస్కా కొట్టే ప్రయత్నమే చేశారు. లోకేష్ కేవలం విజువల్స్, మ్యూజిక్ సాయంతో ఇంట్రెస్టింగ్ ప్రోమోలు కట్ చేసి ప్రేక్షకుల్లో హైప్ పెంచుతున్నాడు తప్ప.. తన సినిమాల్లో విషయం ఉండట్లేదు. ఖైదీ, విక్రమ్ సినిమాలను మినహాయిస్తే అతను గొప్పగా తీసిందేమీ లేదు. అంతమాత్రానికి అతడికి ఇంత హైప్ ఎందుకిస్తున్నారన్నది అర్థం కావడం లేదు. ఈ తరంలో మోస్ట్ ఓవర్ రేటెడ్ డైరెక్టర్ అంటూ లోకేష్‌ను విమర్శించే వారికి 'కూలీ' రూపంలో పెద్ద ఆయుధమే దొరికిందని చెప్పాలి.



# డాగ్ లవర్స్‌కు దిమ్మతిరిగే కౌంటర్లు

ప్రముఖ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటారు. ఆయన ట్వీట్లతో తరుచూ వివాదాలు సృష్టిస్తారు. తాజా సుప్రీం కోర్టు వీధి కుక్కల వివాదంపై ఆయన రియాక్ట్ అవుతూ వరుసగా వీడియోలు పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఆయన ట్వీట్ సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఆర్జీవీ Xలో ఓ వీడియో పోస్ట్ చేసి దాని కింద క్యాప్షన్ ఇలా రాశారు.. "కుక్కల ప్రేమికులందరికీ... సుప్రీంకోర్టు తీర్పుపై గగ్గోలు పెడుతున్న వారికి... ఈ వీడియో చూడండి. నడిబొడ్డున పగలు వీధి కుక్కలు ఓ నాలుగేళ్ల బాలుడిని ఎలా చంపాయో చూడండి" అంటూ రామ్ గోపాల్ వర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ట్వీట్‌లో సుప్రీంకోర్టు ఇటీవల వీధి కుక్కలను తరలించాలని ఇచ్చిన ఆదేశాల నేపథ్యంలో జంతు ప్రేమికులు చేస్తున్న విమర్శలను ఆయన వ్యతిరేకించారు. ఢిల్లీలో వీధి కుక్కలు తరలించాలని సుప్రీం కోర్టు ఆదేశాలను కొందరు సినీ సెలబ్రెటీలు తప్పుబట్టారు. సోషల్ మీడియాలో వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు. నటి జాన్వీ కపూర్, వరుణ్ ధావన్, రవీనా టాండన్, సిద్ధార్థ్ ఆనంద్ వంటి ప్రముఖులు సుప్రీంకోర్టు ఆదేశాన్ని సోషల్ మీడియాలో ఖండించారు. అలాగే యాక్టర్ జాన్ అబ్రహం కూడా CJI జస్టిస్ బి.ఆర్.గవాయికి ఒక అప్పీల్ పంపారు. ఆ ఆదేశాలను సమీక్షించాలని కోరారు. తన లేఖలో, జాన్ అబ్రహం వీధి కుక్కలను "కమ్యూనిటీ డాగ్స్" అని, "ఢిల్లీ పౌరులే" అని అభివర్ణించారు. అంతేకాదు హీరోయిన్ సదా వీధి కుక్కలను తరలించవద్దని బోరున ఏడుస్తూ వీడియో చేశారు. వీరందరినీ ఆర్జీవీ ఈ ట్వీట్ ద్వారా ప్రశ్నించారు.



# అనన్య కిల్లింగ్ హొయలు

యువ నటీమణి అనన్య నాగళ్ళ తన కొత్త ఫోటోషూట్‌తో సోషల్ మీడియాలో మరోసారి అభిమానులను ఆకట్టుకున్నారు. వైట్ కలర్ సారీతో, ఫ్లోరల్ ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌లో కనిపించిన ఆమె లుక్ క్లాసీగా, స్టైలిష్‌గా ఉంది. క్యూట్ మేకప్, సాఫ్ట్ కర్ల్స్‌తో సింపుల్ కానీ అందమైన ప్రెజెన్స్ ఇవ్వడం గమనార్హం. ఈ లుక్‌లో ఆమె కొంటెతనం, గ్లామర్ రెండూ కలగలిసి ఉన్నాయని చెప్పవచ్చు. ఈ ఫోటోలు చూసిన ఫ్యాన్స్ వైట్ లుక్‌లో మేజిక్ క్రియేట్ చేశావు, హార్ట్‌లో హుక్ అయిపోయింది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. కొందరు ఆమె సింపుల్ సారీ లుక్‌ని చాలా ఫ్రెష్‌గా, కొత్తగా ఉందని ప్రశంసిస్తున్నారు. ఇలాంటి ట్రెడిషనల్ విత్ మోడరన్ టచ్ లుక్స్‌లో అనన్య ఎక్కువగా సూట్ అవుతుందని కూడా ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. అనన్య కెరీర్ విషయానికి వస్తే, ఆమె తొలిసారి మల్లేశం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. రియలిస్టిక్ డ్రామాలో ఆమె నటన మంచి ప్రశంసలు అందుకుంది. ఆ తర్వాత వకీల్ సాబ్లో కీలక పాత్రలో నటించడం ద్వారా మరింత గుర్తింపు తెచ్చుకున్నారు. తన సొగసైన నటన, సింపుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో తక్కువ సమయంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు.అంతేకాకుండా, అనన్య మరికొన్ని తెలుగు సినిమాలు, వెబ్ ప్రాజెక్టుల్లో కూడా కనిపించారు. గ్లామర్‌తో పాటు కంటెంట్ డ్రైవన్ పాత్రల్లోనూ తాను సక్సెస్ అవుతానని నిరూపించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం కొత్త సినిమాల కోసం ఎంపిక అవుతూ, వైవిధ్యమైన రోల్స్‌తో ముందుకు వెళ్ళాలని చూస్తున్నారు. మొత్తం గా చూస్తే, ఈ తాజా ఫోటోషూట్‌లో అనన్య నాగళ్ళ మరోసారి తన స్టైల్ సెన్స్‌ని రుజువు చేశారు. ఆమె ఎంచుకునే రోల్స్, ఫ్యాషన్ లుక్స్, అభిమానులతో కనెక్ట్ అయ్యే విధానం ఆమెను ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి. రాబోయే కాలంలో మరిన్ని ఆసక్తికరమైన ప్రాజెక్టులతో ఆమె ముందుకు రావాలని అభిమానులు ఎదురుచూస్తున్నారు.

# స్తంభించిన జన జీవనం

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో జోరు వాన
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- చెరువుల్లా మారిన పంట చేలు
- వర్షాలకు తడిసి కూలిన ఇళ్లు
- కుమరంభీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత





**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో జోరు వాన కురిసింది. జిల్లాలో శనివారం కురిసిన కుండపోత వర్షానికి జనజీవనం అతలకుతులం అయింది. భారీ వర్షానికి వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు మండల వ్యాప్తంగా కురిసిన బారీ వర్షానికి తుంపల్లి గ్రామ సమీపంలో గూడెన్‌ఘాట్ వాగు లోలెవల్ వంతెనపై నుంచి ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహించింది. దీంతో ఆసిఫాబాద్ చిర్రకుంట గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజూర గ్రామ సమీపంలోని ఒర్రె ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు అటువైపు వెళ్లెందుకు నిరీక్షించాల్సి వచ్చింది. కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్ డేవిడ్, డీపీవో భిక్షపతిగౌడ్, డీఎల్‌పీవో ఉమర్, తహసీల్దార్ రియాజ్‌ఆలీ పరిశీలించి సూచనలు చేశారు. జిల్లా కేంద్రంలోని పైకాజీనగర్, చెక్‌పోస్టు కాలనీలలో వరదనీరు ముంచెత్తింది. వరద ఉధృతికి కంఠకాలనీలోని ఒడ్డెపల్లి ఫంక్షన్‌హల్ ప్రహరీగోడ నేలమట్టమయింది. జూబ్లీమార్కెట్‌లోని మటన్, చికెన్ సెంటర్ల వద్ద వరదనీరు వచ్చి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కుమరంభీం, వట్టివాగు ప్రాజక్టులలోకి బారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో కుమరంభీం ప్రాజెక్టులోకి 52,100 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరగా అరు గేట్లు పైకి ఎత్తి 52,100 క్యూసెక్కుల వరదనీటిని కిందికి వదులుతున్నారు. వట్టివాగు ప్రాజెక్టులోకి 9.600 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో నాలుగు గేట్లు పైకి ఎత్తి 10800 క్యూసెక్కుల వరదనీటిని కింది వదులుతున్నారు. దీంతో పెద్దవాగు నది ఉధృతంగా ప్రవహిస్తుంది. నది పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటలలో 25.9 మిల్లీమీటల వర్షపాతం నమోదైంది. కౌటాలలో అత్యధికంగా 65.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. బెజ్జూరు మండలంలో 47.2, పెంచికల పేటలో 40.4, ఆసిఫాబాద్, లింగాపూర్ మండలాల్లో 30.8, చింతలమానేపల్లిలో 29.2, తిర్యాణిలో 27.8, దహెగాంలో 25.2, సిర్పూర్(టి)లో 16.8, జైనూరులో 16.4, కెరమెరిలో 16.2, సిర్పూర్(యూ)లో 15.6, వాంకిడిలో 10.8, రెబ్బెనలో 8.0, కాగజ్‌నగర్‌లో 7.8 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉదయం ఆరు గంటల నుంచి ప్రారంభమైన వర్షం మధ్యాహ్నం 12 గంటల వరకు కురిసింది. వర్షాలకు పట్టణంలోని లోతట్టు ప్రాంతాలైన మార్కెట్ ఏరియా, కౌసర్ నగర్, ద్వారకనగర్, సంజీవయ్య కాలనీలో వర్షం నీరు వచ్చింది. స్థానిక చాకలి రేవులోకి నీట మునిగింది. కాగజ్‌నగర్ పెద్దవాగులో నీటి ఉధృతి పెరిగింది. పెద్దవాగు పరివాహేక ప్రాంతాలకు సంబంధించి గ్రామాల వారిని రెవెన్యూ అధికారులు అప్రమత్తం చేశారు. చేపలు పట్టేందుకు ఎవరిని కూడా లోనికి అనుమతించేదు. బెజ్జూరు మండలంలో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని లో లెవల్ వంతెనలు భారీగా ఉప్పొంగడంతో రాక పోకలు స్తంభించాయి. మండలంలోని కుశ్నపల్లి, సోమిని గ్రామాల మధ్య రెండు లో లెవల్ వంతెనలు ఉప్పొంగడంతో వాగు అవతల ఉన్న ఎనిమిది గ్రామాలకు రాక పోకలు పూర్తిగా స్తంభించాయి. వాగు అవతల ఉన్న సుస్మీర్, సోనిమి, ఇప్పలగూడ, బండలగూడ, పాత సోమిని, గెర్రెగూడ, నాగెపల్లి, చింతలపల్లి తదితర గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగి పోయాయి. మండలంలోని హెటిగూడ గ్రామానికి చెందిన పంబాల సన్నాసి ఇల్లు కూలి పోయింది. ఇంట్లో ఉన్న ధాన్యం తడిసి ముద్ద అయింది. సుమారు లక్ష రూపాయల ఆస్తి నష్టం వాటిల్లింది. దహెగాం మండల వ్యాప్తంగా శనివారం ఉదయం భారీ వర్షం కురవడంతో ఒర్రెలు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. దీంతో పలు గ్రామాలకు రాక పోకలు నిలిచి పోయాయి. అయినం సమీపంలోని లో లెవల్ వంతెన పై నుంచి వరద నీరు పారడంతో దహెగాం నుంచి కాగజ్‌నగర్ వెళ్లే వాహనాలు గంటల తరబడి నిలిచి పోయాయి. బొప్పురం, మురళీగూడ, లోహ గ్రామాలకు వెళ్లే దారిలో ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించడంతో రాక పోకలు నిలిచి పోయాయి. మండల వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో పంట పొలాలు నీట మునిగాయి. మండల కేంద్రంలో పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. కెరమెరి, లక్మాపూర్, అనార్‌పల్లి వాగులు పొంగి ప్రవహించడంతో సుమారు 10 గ్రామాల ప్రజలకు మండల కేంద్రానికి పాక్షికంగా రాక పోకలు తెగి పోయాయి. అలాగే సాంగ్వీ, కేలి(బి) గ్రామాల మధ్య ఉన్న లో వెల్ వంతెన పై నుంచి వరద నీరు ప్రవహించడంతో అవతల వైపు ఉన్న మహారాష్ట్రలోని జివితి ప్రాంతానికి రాక పోకలు స్తంభించాయి. మెట్టపిప్పిరి లో లెవల్ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిం చింది. నది పరివాహక ప్రాంతాల్లో పత్తిచేలలోకి వరదనీరు చేరింది. చింతలమానేపల్లిలో భారీ వర్షానికి దిందా గ్రామ ప్రజలకు రాక పోకలు నిలిచి పోగా ప్రపంచానికి దూరంగా ఉన్నారు. గ్రామానికి చెందిన పంగిడి తారక నగ్మాజీ ఇల్లు పూర్తిగా నేలమట్టం అయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరు లేక పోవడంతో ముప్పు తప్పిందని కుటుంబీకులు తెలిపారు. బాలాజీ అనుకోడ గ్రామంలో శనివారం కురిసిన వర్షానికి ఓ ఇల్లు కూలి పోయింది. అదే గ్రామానికి చెందిన బాయక్కకు చెందిన ఇల్లు కూలి పోయినట్లు స్థానికులు తెలిపారు. పెంచికలపేటలో మండలం ఎల్లూరు సమీపంలో వాగు ఉప్పొంగడంతో ఆర్టీసీ బస్సు నిలిచి పోయింది. పెద్దవాగు, బొక్కివాగు, ఉచ్చమల్లవాగులతో పాటు ఒర్రెలు సైతం ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పెద్దవాగు వరద ఉధృతితో రహదారులపై నీరు చేరడంతో కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, నందిగామ గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. పెద్దవాగు, ఉచ్చమల్ల వాగు పరివాహక గ్రామాల్లోని పొలాలు, పంట చేనులు నీట మునిగాయి. పులువరి ఇళ్ల ఆవరణలో నీరు చేరింది. జైనూర్‌లో భారీ వర్షాలకు లేండిగూడ వాగు ఉప్పొంగి ప్రవహించడంతో రాక పోకలు నిలిచి పోయాయి. నది పరివాహక ప్రాంతాలోని పంటలు భారీ వర్షానికి చేరిన వరదతో నీట మనిగినట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. సిర్పూర్(యు) మండలంలోని పాముపాలడ, కోడ్డిగూడ, అలీగూడ, శెట్టిహుడ్పూనూర్ వాగులు పొంగి ప్రవహించాయి. వాగులను ఎవరు దాటవద్దని అధికారులు ప్రజలకు హెచరిస్తున్నారు. ప్రజలు బయటకు రావద్దని కోరుతున్నారు.

## కడెం నదిలో ఒకరి గల్లంతు

**కడెం, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కడెం నదిలో శనివారం అందరూ చూస్తుండగానే ఓ వ్యక్తి వరదలో చిక్కుకొని గల్లంతయ్యాడు. కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన గంగాధర్ మధ్యాహ్నం కడెం నదిలో చేపలు పడుతుండగా.. ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో ఒక్కసారిగా వరద అతని చుట్టుముట్టింది. నది నుంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలించలేదు. కొద్దిసేపు నదిలో ఉన్న ఓ ఎత్తున ప్రదేశంలో ఉండి రక్షణ కోసం వేచి చూసినా.. వరద కారణంగా రక్షించేందుకు వీలు లేకుండా పోయింది. వరద మరింత పెరగడంతో నీటిలో కొట్టు పోతున్న అతడిని చూసిన కొందరు ఫోన్‌లో చిత్రీకరించారు.



## అలుగు తవ్వి.. కట్టను రక్షించి

**కుభీర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
మండలంలోని డోడర్న సమీపంలో ఏళ్ల క్రితం నిర్మించిన చెరువు కట్ట శిథిలావస్థకు చేరింది. కట్ట తెగిపోతుందని నీటి పారుదలశాఖ అధికారులు శుక్రవారం చెరువుకు అలుగును తవ్వించారు. విషయం తెలుసుకున్న మత్స్యకారులు చెరువు వద్దకు చేరి అలుగు తవ్వితే అందులోని చేపపిల్లలు కొట్టుకుపోతాయని, ఉపాధి కరవవుతుందని అధికారులకు విన్నవించుకున్నారు. సమాచారం ఇవ్వకుండా అలుగును తవ్వటం సరికాదని అధికారులతో జాలరులు వాదనకు దిగారు. మత్స్యకారులకు నచ్చజెప్పి మీటరు లోతు మేర తవ్వారు. ఇదే విషయమై సంబంధితశాఖ ఇంజినీరు రంజిత్‌ను వివరణ కోరగా.. ఎగువ భాగంలో అధిక వర్షాలు కురుస్తుండటంతో కట్ట తెగిపోయే ప్రమాదం ఉందన్నారు. కొంతమేర అలుగు తవ్వించి వరద నీటిని బయటకు పంపించే ఏర్పాట్లు చేశామన్నారు.

## అడవి పంది దాడిలో రైతు మృతి

### మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



**కన్నెపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. పత్తి చేనుని చూసేందుకు వెళ్లిన రైతుపై అడవి పంది దాడి చేసి చంపిన ఘటన శనివారం మధ్యాహ్నం మంచిర్యాల జిల్లా కన్నెపల్లి మండలం వెంకటాపూర్‌లో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. గత రాత్రి నుంచి భారీ వర్షం కురుస్తుండడంతో సుర్జాపూర్ లోని పత్తి చేను ని చూసేందుకు వెళ్లిన వెంకటాపూర్ కు చెందిన దాగామ రామయ్య (60) అనే రైతు పై అడవి పంది దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అంతకుముందు అదే అడవి పంది గుండ్ల చిరంజీవి, మేకల బాపు అనే వ్యక్తులపై దాడి చేయగా గాయాలయ్యాయి. వారిని వెంటనే చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.



## ప్రోటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించకుండా సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్నారని, అలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుజిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌కు శనివారం లేఖ రాశారు. మంచిర్యాల జిల్లా, మంచిర్యాల నియోజకవర్గంలో కాం గ్రెస్ పార్టీ నాయకులు అనేక సందర్భాలలో అధికారుల సమక్షంలో ప్రభుత్వ కార్యక్రమాలలో వారే ముఖ్య అతిధులుగా పాల్గొని ప్రభుత్వ నుంచి వస్తున్న చెక్కులను అందజేస్తు పేపర్లలో వార్తలు వస్తుండటంతో ప్రజలలో దీనిమీద చర్చ జరుగుతుందని, ఈ విధానం తప్పని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మీపై ఉందని గుర్తు చేస్తు, ఇలాంటివి జరిగినప్పుడు సంబంధిత అధికారి మీద చర్య తీసుకోవాలని కోరారు. అలా జరిగిన కొన్ని సందర్భాలను తెలిపారు. మంచిర్యాల గార్డెన్స్‌లో ఈ నెల 15న జరిగిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు చేతుల మీదుగా పంపిణీ చేశారని, షాదీ ఖానా హాలులో జూలై 24న రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పంపిణీ చేశారు. ఏప్రిల్ 1న సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మంచిర్యాల జిల్లా అధ్యకురాలు చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం జరిగిందని, దానికి సంబంధించిన వార్తా కథనాలు మీకు పంపియడం జరుగుతుందని పేర్కొన్నారు. అంతే కాకుండా రేషన్ షాప్ ముందు ఎలాంటి



ప్రోటోకాల్ లేని కాంగ్రెస్ నాయకుల ప్లెక్సీలు పెట్టారని, ఈ విధంగా అనేక సందర్భాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎలాంటి ప్రోటోకాల్ లేకున్నా వారి ఇష్టానుసారంగా ప్రభుత్వ కార్యక్రమాలలో అధికారికంగా పాల్గొంటురన్నారని, దీనిని మేము తప్పుపడుతున్నామని, సదరు అధికారులపై వెంటనే చర్య తీసుకొని, భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా చూడాలని కోరుతున్నామన్నారు.



# ప్రజా రవాణాకు ఇబ్బందులు కలగకుండా చర్యలు

**నీటి ఉధృతిని పరిశీలించి.. సూచనలు చేసి..**
**అధికారులు అప్రమత్తంగా ఉండాలి**
**నదీ ప్రవవాహక ప్రాంతాలకు ఎవరూ వెళ్ల వద్దు**
**అత్యవసర సమయంలో టోల్ ఫ్రీ నెం.ఫోన్ చేయాలి**
**కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే**





**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

వర్షాల కారణంగా రవాణా వ్యవస్థకు ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మత్తు చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లాలో కురిసిన భారీ వర్షానికి ఆసిఫాబాద్ మండలం రాజుర గ్రామానికి వెళ్లే రహదారి పైన ఉన్న లో లెవెల్ వంటేనకు ఇరువైపులా కోతకు గురైన రహదారిని పరిశీలించి పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ప్రజల రవాణాకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మద్దు చర్యలు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గత రాత్రి నుండి ఉదయం వరకు జిల్లాలో భారీ వర్షం కురిసినందున వాగులు, ఒర్రెలు ఉత్రుతంగా ప్రవహిస్తున్నాయని, ఎవరు దాటే ప్రయత్నం చేయకూడదని, అత్యవసరం అయితేనే బయటకు రావాలని తెలిపారు. వ్యవసాయదారులు చేనులలో, పశువుల కాపరులు పశువుల మీదకు అడవికి వెళ్లకూడదని, నెలలు నిండిన గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు, ఆసుపత్రిలోని బర్త్ వెయిట్ సెంటర్లకు తరలించాలని తెలిపారు. ప్రజల తక్షణ సహాయం కొరకు సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలో కంట్రోల్ రూమ్ నం. 8500844365 లో సంప్రదించవచ్చని తెలిపారు. జన జీవనానికి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో వాగులు, కాజ్ వే ల వద్ద పోలీస్, రెవెన్యూ, పంచాయితీ రాజ్ సిబ్బందితో సహారా ఏర్పాటుచేసి అటువైపుగా ఎవరు వెళ్లకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల వారిని రక్షించడానికి ఎస్. డి. ఆర్. ఎఫ్. బృందాలు సిద్ధంగా ఉన్నాయని, శిథిలావస్థలో ఉన్న భవనాలలో ఉన్న వారిని గుర్తించి వారికి పునరావాసం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డేవిడ్‌తో కలిసి ఆసిఫాబాద్ మండలం తుంపెల్లి వాగుపై గల వంతెనను పరిశీలించారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలోని వాగులు, ఒర్రేలు, కాజ్ వే లు, వంతెనలపై నుండి వరద నీరు ప్రమాదకరంగా నిర్వహిస్తుందని, ప్రజలు, వాహనదారులను ఎట్టి పరిస్థితులలో అటువైపు వెళ్లకుండా అధికారులు బందోబస్తు చర్యలు తీసుకోవాలని, వరద ప్రవాహ సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. భారీ వర్షాల సూచన ఉన్నందున గ్రామాలలో పాటించవలసిన జాగ్రత్తలపై ప్రజలకు తెలిసే విధంగా టామ్ టామ్ చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి గౌడ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, తహసిల్దార్ రియాజ్ అలీ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లి రహదారులు జలమయం





**మరోసారి రాంనగర్ బ్రిడ్జికి వరద ముంపు**
**నిలిచిపోయిన రాకపోకలు - ఇళ్లకే పరిమితమైన జనం**



**బెల్లంపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లిలో కురుస్తున్న భారీ వర్షం ప్రజలను అతలాకుతలం చేస్తుంది. ఎడతెరపిలేని భారీ వర్షానికి పట్టణంలోని ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి. వరద నీరు రహదారులలో పరుగులు పెడుతుంది. పాత జిఎం క్రాస్ రోడ్ నుంచి వర్క్ షాప్ వరకు ప్రధాన రహదారిలోవరద నీరు చేరింది. మరోసారి రాంనగర్ బ్రిడ్జి ఉప్పొంగుతుంది. అశోక్ నగర్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వరద నీటితో నిండిపోయింది. రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలు భారీ వర్షానికి ఇబ్బంది పడుతున్నారు. వరద నీరు నివాసాల్లోకి చేరి ఇక్కట్లు పడుతున్నారు. మున్సిపాలిటీలోని ప్రధాన మురుగు కాలువల సమీపంలో ఉన్న నివాస ప్రాంతాలు వరద తాకిడికి గురయ్యాయి. భారీ వర్షానికి ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



## గిరిజన తండాల్లో ముగిసిన తీజ్ ఉత్సవాలు

**ఇంద్రవెల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

మండలంలోని హర్కాపూర్ తండా, ఈశ్వర్ నగర్, బీక్కుతండా, వాగాయితండా, ఏమాయికుంట గ్రామాల్లో శనివారం తీజ్ పండుగ ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. రాఖీ పౌర్ణమి నుంచి ప్రారంభమైన తీజ్ ఉత్సవాల్లో గ్రామాల్లో పెళ్లి కాని యువతులు గ్రామ నాయక్ (గ్రామపెద్ద) ఇంట్లో వెదురు బుట్టలో గోదుమలు వేసి నారు మొలకెత్తే వరకు తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నీరు పోస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం గోకులాష్టమి పండుగ సందర్భంగా తీజ్ ఉత్సవాలను ముగించారు. ఈ సందర్భంగా యువతులు, మహిళలు తీజ్ బుట్టలతో చేసిన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం గ్రామ పొలిమేరలోని వాగులో తీజ్‌లను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చౌహన్ నాయక్, జాదవ్ దుదిరాం, రాథోడ్ శేవంతరోహిదాస్, జాదవ్ మీరాప్రకాష్ సేవాలాల్, ధర్మ ప్రచారక్ ఆడే ప్రేమ్ సింగ్ మహారాజ్, గోగారాం, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## కులం పేరుతో దూషించిన ఇద్దరిపై కేసు

**జన్నారం, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

కులం పేరుతో దూషించిన ఇద్దరు పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గొల్లపల్లి అనూష తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామానికి చెందిన రామటంకి శ్రీనివాస్‌కు జన్నారం మండలంలోని రేండ్లగూడ గ్రామ శివారులో ఆయన భార్యపై 158/4 సర్వే నెంబర్ లో ఒక ఎకరం భూమి పట్టా కలిగి ఉన్నాడు. ఇట్టి భూమిని అదే గ్రామానికి చెందిన బాల్త రాజమౌళి, బాల్త భూమక్కలు వారికి తెలియకుండా ట్రాక్టర్‌తో దున్నించినారని, కోర్టులో కేసులు కూడా నడిచాయని తెలిపారు. అది మనసులో పెట్టుకొని వారిద్దరిని కులం పేరుతో దూషించారని శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు.

## నెన్నెలలో లోతట్టు ప్రాంతాలు జలమయం

**నెన్నెల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**



మంచిర్యాల జిల్లా నెన్నెల మండలంలో ఉదయం నుంచి భారీ వర్షం కురుస్తున్నది. శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వానతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పంట పొలాలు వరద నీటిలో మునిగిపోయాయి. చెరువులు కుంటలు మాత్తడి పోస్తున్నాయి. నెన్నెల కుమ్మరి వాగు చెరువు నిండుకుండాలా మారింది. జోగాపూర్ మత్తడి వాగు వరద నిటితో నిండు కుండను తలపిస్తున్నది. లంబాడితండా ఎర్రవాగు, జంగళపేట వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో పత్తి చెన్లు, వరి పొలాలు వరదలో మునిగి పోయాయి. కోణంపేట, నెన్నెలలో లోతట్టులో ఉన్న ఇండ్లలో నీళ్లు చేరాయి. పాత ఇండ్లు, పూరి గుడిసేల్లో ఎవరూ ఉండవద్దని గ్రామాలలో డప్పు చాటింపు వేశారు. మండల వ్యాప్తంగా 77 మిల్లి మీటర్ల వర్షం పాతం నమోదయ్యింది. మరో 24 గంటల పాటు భారీ వర్షం కురుస్తుందని వాతావరణ శాఖ ప్రకటించింది. భారీ వర్షాల నేపథ్యంలో పంటలు కొట్టుకు పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను పరిశీలిస్తున్నారు.

## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**కుభీర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఋతుపవనాలకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల ఏకధాటిగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కుభీర్ తహసీల్దార్ శివరాజ్ మండల ప్రజలకు సూచించారు. ఫోన్లో మండంలోని గ్రామ రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. కుభీర్‌తో పాటు పలు గ్రామాలను సందర్శించి గ్రామ రెవెన్యూ అధికారులను అప్రమత్తం చేశారు. మట్టితో కట్టిన ఇండ్లు, పాత నివాసాల్లో ఉన్న వారిని ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. చెరువుల్లోకి చేపలు పట్టేందుకు వెళ్లనీయవద్దని, పశువులను మేపేందుకు వెళ్లకుండా గ్రామంలో దండోరా లేదా మైకుల ద్వారా అనౌన్స్ చేయించాలని సూచించారు. ఇనుప విద్యుత్ స్తంభాలను తాకకుండా జాగ్రత్త పడే విధంగా అప్రమత్తం చేయాలన్నారు. గ్రామాల్లోని వర్షాల వల్ల కలిగే నష్టాలను ఎప్పటికప్పుడు సమాచారం అందించాల్సిందిగా ఆదేశించారు. రానున్న రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తా యని వాతావరణ శాఖ సమాచారం మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.





## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల

**నిర్మల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
రాబోయే రెండు రోజులు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలు అప్రమ త్తంగా ఉండాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రం సిద్దాపూర్ శివారులోని వాగును శనివారం సం దర్శించారు. అక్కడి పరిస్థితిని ఏఎస్పీ రాజేష్ మీనాతో కలిసి సమీక్షించారు. ప్రజలు లోతట్టు ప్రాంతాలకు వెళ్ల కూడదని, ముఖ్యంగా రైతులు విద్యుత్తు తీగలతో, స్తంభాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లాలో ఎక్కడ ఏ విపత్తు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో పోలీసు యంత్రాంగం ముందస్తు చర్య లు చేపడుతుందన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితు ల్లో అవసరమైతే 100 లేదా స్థానిక పోలీసు హెల్ప్ లైన్ కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ మేరకు పోలీసు అధికారులకు, సిబ్బందికి ఆదేశాలు జారీ చేశా రు. రోడ్లపై ట్రాఫిక్ స్తం భించకుండా చూడాలన్నారు. విపత్తు సంభవించినప్పుడు సిబ్బంది, రెస్క్యూ టీంతో కలిసి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

## ప్రయాణికులను కాపాడిన సీఐ

**ఖానాపూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
వరద నీటిలో చిక్కుకున్న ఓ కుటుంబాన్ని వరంగల్ జిల్లా దుగ్గొండి సీఐ సాయిరమణ కాపాడారు. నిర్మల్ జిల్లాకు చెందిన బాస లక్ష్మీనారాయణ, అన్నపూర్ణ, రితి క, రీతిన్ భద్రాచలానికి కారులో వెళ్తున్నారు. ఖానా పురం మండలంలోని చిలుకమ్మనగర్–కొత్తగూడ మధ్య లో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీటిలో చిక్కుకుపో యారు. వెంటనే లక్ష్మీనారాయణ పోలీసులకు సమా చారం అందించారు. డీజీ కంట్రోల్ కార్యాలయం నుం చి స్థానిక పోలీసులకు సమాచారం అందడంతో సీఐ సాయిరమణ శనివారం తెల్లవారు జామున 3 గంటల కు చిలుకమ్మనగర్కు చేరుకుని గ్రామస్తుల సహకారం తో వారిని క్షేమంగా బయటకు తీసుకొచ్చారు. సదరు కుటుంబ సభ్యులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## యూరియా గోదాంలోకి చేరిన వర్షపు నీరు

**బోథ్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి చెందిన గోదాంలోకి వర్షపు నీరు చేరడం తో పదుల సంఖ్యలో యూరియా బ్యాగులు తడిసి ముద్దయ్యాయి. అయితే గోదాములోకి వర్షపు నీరు చేరడంతో అక్కడ ఉన్న సిబ్బంది మోటార్ సహాయంతో వర్షపు నీటిని తోడే ప్రయత్నం చేస్తున్నారు. గోదాం చుట్టూ బురద కాకుండా ఉండడానికి మొరం వేశారు కానీ ఇప్పటికైనా గోదాం లోకి నీరు ప్రవేశించకుండా ఉండడానికి అధికారులు చర్యలు చేపట్టి నూతన గోదామును నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

# గఒక్క క్లిక్‌తో పాఠాలు ప్రత్యక్షం

**ఆసిఫాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
సాంకేతిక పరిజ్ఞానం విద్యారంగంలోను కొత్త విప్లవం తీసుకు వస్తుంది. పాఠశాలల్లో చెప్పే పాఠాలను అరచేతిలోని స్మార్ట్ ఫోన్‌లోనూ వినే అవ కాశం అందుబాటులోకి వచ్చింది. ఏదై నా కారణం చేత బడికి వెళ్లలేని పరిస్థితిలో కొందరు విద్యా ర్థులు పాఠాలను మిస్ అయినప్పుడు, అలాగే పాఠశాలలో చెప్పిన పాఠం అర్థం కానప్పుడు చింతించాల్సిన అవసరం లేదు. ఇలాంటి విద్యార్థుల కోసం 'దీక్ష' యాప్‌ను విద్యాశాఖ అందుబాటులోకి తీసుకువచ్చింది. స్మార్ట్ ఫోన్‌లో ఈ యా ప్‌ను ఓపెన్ చేసి ఒక్క క్లిక్ చేస్తే మనకు కావాల్సిన పాఠాలను వినొచ్చు. ఈ యాప్‌లో ఒకటి నుంచి 10వ తరగతి వరకు పుస్తకంలోని పాఠ్యాంశాలన్నీ అందుబాటులో ఉంటాయి. పుస్తకంలోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పాఠ్యాంశానికి సంబంధించిన వీడియోను చూడొచ్చు.

**పాఠశాలకు వెళ్లలేని వారికి..**
ఏదైనా కారణం చేత పాఠశాలకు వెళ్లలేక ఉపాధ్యా యులు చేప్పే పాఠాలు మిస్ అయ్యే విద్యార్థుల బాధ లు అన్ని ఇన్నీ కావు. క్లాస్‌లకు వెళ్లలేక పోయినందున తోటి విద్యార్థులతో పోటీలో వెనుకబడి పోతామని అవేదన చెందుతుండడం పరి పాటి. అయితే ఇక మీదట ఇలాంటి బాధలు పడాల్సిన పనిలే దు. తోటి విద్యార్థులపై ఆధారపడాల్సిన అవసరం ఎంత మా త్రం లేదు. తమకు కావాల్సిన సబ్జెక్టులోని పాఠాలను ఎప్పు అంటే అప్పుడు నిపుణులైన ఉపాధ్యాయులు చెప్పే వీడియో క్లాస్‌ల ద్వారా వినవచ్చు. ఇందుకోసం విద్యా శాఖ దీక్ష అనే




యాప్‌ను విద్యార్థులకోసం అందుబాటు లోకి తెచ్చింది. ఒకటి నుంచి పదవతరగతి వరకు పాఠ్యపుస్తకాల్లోని పాఠ్యాంశాలన్నీ యాప్‌లో పొందుపరి చింది. పలు భాషల్లో ఈ పాఠ్యాంశాలు వినే విధంగా దీన్ని రూపకల్పన చేశారు. పాఠ్యపుస్తకాల్లోని క్యూఆర్‌కో డ్‌ను స్కాన్ చేసి తమకు కావాల్సిన పాఠాలను ఈ దీక్ష యాప్ ద్వారా ఎన్నిసార్లు అయినా వినవచ్చు. విద్యార్థుల మానసిక స్థాయికి తగినట్లు దృశ్యరూ పకంగా బోధన సాగుతుంది. ఒక్క క్లిక్‌తో పాఠ్యాంశా లను విని ఆయా సబ్జెక్టుల్లో పూర్తి స్థాయిలో పట్టు సాధించవచ్చు. స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అర్థం కాని పాఠ్యాంశాన్ని చదివే వెసులు బాటు కల్పించారు. ఏమైనా సందేహాలున్నా యాప్ ద్వారా వీటిని నివృత్తి చేసుకోవచ్చు. విద్యార్థులు పాఠ శాలలకు వెళ్లలేనప్పుడు ఇంటి దగ్గర నుంచే ఈ పాఠాలన్నీ వినవచ్చు. తరగతి గదిలో తమ టీచర్ చెప్పిన పాఠం సరిగా అర్థం కాకున్నా ఇంటికి వెళ్లి దీక్ష యాప్ ద్వారా ఆ పా ఠ్యాంశాన్ని ఒకటికి రెండుసార్లు విని పూర్తిగా తెలుసు కోవచ్చు. ఈ యాప్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు ఉభయతారకంగా పనిచేసే విధంగా రూపొందించారు. ఇందులోని పాఠ్యాంశాలన్నీ సురక్షితులైన ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధిం చారు. దీంతో ఇతర ఉపాధ్యాయులు కూడా వీటిని చూడడం ద్వారా మేలైన పద్ధతుల్లో బోధన చేయ డానికి ఉపయోకరంగా ఉంటుంది.

**డౌన్‌లోడ్ ఇలా..**
స్టార్ట్ ఫోన్‌లోని ప్లేస్టోర్ లేదా ఐఓఎస్‌లోకి వెళ్లి 'దీక్ష' ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసు కోవాలి. యాప్ లోకి వెళ్లి లాంగ్వేజ్‌తో పాటు ఇతర అడిగిన వివరాలన్నీ నమోదు చేయాలి. ఆ తర్వాత లాగిన్ అవ్వాలి. ఈ యాప్‌ను ఉపయోగించి డిజిటల్ టెక్ట్స్‌బుక్స్‌పై స్కాన్ చేస్తే డిజిటల్ పాఠం వస్తుంది. పాఠ్యపుస్తకం ప్రధాన పుటపై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే స్మార్ట్ ఫోన్‌లో కోరుకున్న పాఠ్యాంశాన్ని పొందవచ్చు. నిపుణులైన ఉపాధ్యాయులు బోధించిన పాఠాలను ఎన్ని సార్లు అయినా వినవచ్చు.

**యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి**
**రాజేష్, ఉపాధ్యాయుడు**
విద్యాశాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన దీక్ష యాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాలకు వెళ్ల లేని విద్యార్థులకు ఈ యాప్‌ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. క్లాస్‌లో టీచర్ బోధిం చిన సబ్జెక్టును తిరిగి స్మార్ట్ ఫోన్‌లో ఈ యాప్ ద్వారా తెలు సుకునే అవకాశం ఉంది. అర్థం కాని సబ్జెక్టును ఎన్ని సార్లు అయినా విని అర్థం చేసుకోవచ్చు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ సూ చించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును శనివారం ఆయన సందర్శించారు. 24 గంటల నుంచి 36 గంటలు భారీ వర్షసూచన ఉన్నదని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాల న్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను పునరావాస ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ప్రాణ, ఆస్థినష్టం జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర సేవల కోసం 08736-250501కు ఫోన్ చేయాలని తెలిపారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావ్ దేశ్‌పాండే, అధికారులున్నారు.

## ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ సస్పెన్షన్

**కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
మండలంలోని కొత్తసార్సాలలో 2019లో జరిగిన అటవీశాఖ అధికారుల దాడి కేసులో ఉద్యోగ నియమావళికి వ్యతిరేకంగా వాంగ్మూలం ఇచ్చినందుకు సెక్షన్ ఆఫీసర్ ప్రసాద్ రావును చీఫ్ కన్జర్వేషన్ ఆఫ్ ఫారెస్ట్ ప్రభాకర్ సస్పెండ్ చేశారు. 2019లో కొత్తసార్సాల గ్రామంలో ఫారెస్ట్ అధికారులపై కొంతమంది దాడి చేయగా మొదట పోలీసులకు ఒకరకమైన వాంగ్మూలం, ఆ తర్వాత కోర్టులో మరో రకమైన వాంగ్మూలం ఇవ్వడంతో ఉద్యోగ నియమావళికి వ్యతిరేకంగా సాక్ష్యం చెప్పారని, నిబంధనలు వ్యతిరేకించినందుకు ఎఫ్ఎస్వో ప్రసాద్ రావుపై సస్పెన్షన్ వేటువేశారు. ఇటీవల ఆదిలాబాద్ కోర్టులో కేసు విషయంలో వి చారణ జరగగా అంతకుముందు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలానికి వ్యతిరేకంగా కోర్టులో జడ్జి ఎదుట మరో వాంగ్మూలం ఇచ్చారని, ఈ మేరకు నిబంధనల ప్రకారం సస్పెండ్ చేసినట్లు ప్రభాకర్ వెల్లడిం చారు. ప్రస్తుతం ప్రసాదావు సిర్పూర్(టి) మండ లంలోని చింతకుంట సెక్షన్ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తున్నారు. ఏదైనా కేసులో ప్రభుత్వ ఉద్యోగి పోలీసుల వద్ద ఇచ్చే 161 సీఆర్ పీసీ స్టేట్మెంట్కు విరుద్ధంగా ఇస్తే సీసీఏ రూల్స్కు వ్యతిరేకమని తెలి పారు. దీంతో కేసు తప్పుదోవ పట్టించే ప్రభుత్వ ఉద్యోగులు క్రమశిక్షణ చర్యలకు బాధ్యత వహిం చాల్సి వస్తుందని కాగజ్ నగర్ డీఎస్పీ రామానుజం హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహ ణలో నిబద్ధతతో వ్యవహరించాల్సిన అవసరం ఉం దని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



## చైన్ దొంగిలించిన నేరస్తుడి రిమాండ్

**లోకేశ్వరం, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
మహిళ మెడలో నుండి బంగారు చైన్ తెంపుకెళ్ళిన నేర స్తున్ని 24 గంటల్లోనే పట్టుకొని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఏ ఎస్ పి అవినాష్ కుమార్ తెలిపారు. ఈనెల 14న వాస్తాపూర్ గ్రామానికి చెందిన మేకల యమున అనే మహిళ రోడ్డు పక్కన పశువు లను మేపుతుండగా ఆష్టా గ్రామానికి చెందిన పిప్పెర విజయ్ అనే వ్యక్తి మహిళను మాటల్లో దించి మెడలో గల 20 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్ళాడు. వెంటనే స్పం దించిన లోకేశ్వరం ఎస్సై సిబ్బందితో కలిసి వాటోలి గ్రామంలో సీసీ కెమెరాలను పరిశీలించగా నిందితుని చిత్రాలు రికార్డు అయిఉన్నాయి. సమీప గ్రామాల్లో నింది తుని ఆచూకీ కోసం గాలించగా ఆష్టా గ్రామానికి చెందిన పిప్పెర విజయ్‌గా గుర్తించారు. నిందితుడు వినియోగిం చిన ద్విచక్ర వాహనంతో పాటు బంగారు గొలుసును స్వా ధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితున్ని పట్టుకోవడం లో చాకచక్యంగా వ్యవ హరించిన లోకేశ్వరం ఎస్ఐ అశో క్, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సాయి ప్రశాంత్, లక్ష్మన్‌లను జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించినట్లు ఏఎస్పీ తెలిపారు. ముధోల్ సీఐ మల్లేష్ ఉన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**బెల్లంపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
బెల్లంపల్లి మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో గల శ్రీ సోమేశ్వర అన్నపూర్ణ సహిత దేవాలయ కమిటీ ఆధ్వ ర్యంలో శనివారం సాయంత్రం శ్రీ కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు కు మ్మెర మహాదేవ శర్మ ఆధ్వర్యంలో పూజలను నిర్వహించా రు. అనంతరం ఉట్టి కార్యక్రమం నిర్వహించారు.

## ఏళ్ళు గడిచినా మరని దుస్థితి

**చింతలమానేపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**
ఏళ్ళు గడిచినా ప్రభుత్వాలు మారినా పల్లెలు పల్లెలుగానే ఉన్నాయి. రోడ్డు రవాణా లేకపోవడంతో నేటికీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చింతల మనేపల్లి మండలం గూడెం గ్రామ పంచాయతి శివపెల్లి గ్రామానికీ సరైన రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలం లో బురదలో 3 కిలోమిటర్ల మేర ప్రయాణం చెయ్యాల్సిన పరిస్థితి నెలకొంది. అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తే దేవుడి పై బారం వేయాల్సిందే. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు సౌకర్యాన్ని కల్పించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.





# దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులు చేపట్టాలి

## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పనులు నీటి ప్రవాహం తగ్గిన తర్వాత చేపట్టి పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని కోటపల్లి మండలం ఎదులబంధం గ్రామపంచాయతీలో తుంతుంగ వాగు సమీపంలో గల చెరువు పక్కన పాక్షికంగా దెబ్బతిన్న ఆర్ %డ% బి రోడ్డును మండల తహసిల్దార్ రాఘవేందర్ రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి పరిశీలించి నీళ్లు తగ్గిన తరువాత పైపులు వేసి తాత్కాలిక మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు మూడు రోజుల పాటు భారీ వర్షాల దృష్ట్యా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాలు, వాగులు, లోతట్టు ప్రాంతాలలో అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రాజెక్టులు, ఉధృతంగా ప్రవహించే నదులు, వాగుల వద్దకు ఎవరు వెళ్లకూడదని, పోలీసు శాఖ అధికారులు బందోబస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అత్యవసర సమయాలలో మాత్రమే ప్రజలు బయటకు రావాలని తెలిపారు. తక్షణ సహాయం, పునరావాస కేంద్రాల సమాచారం, ఇతర వివరాల కొరకు జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో కంట్రోల్ రూమ్ 08736-250501 నంబర్ ఏర్పాటు చేసి, 24 గంటలు



తక్షణ సహాయం సేవలు అందుబాటులో ఉంచడం జరిగిందని, జిల్లాలో వరద, ఘటనల సమాచారం ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్ కు అందించాలని తెలిపారు. వర్షాలు ఆగిన తర్వాత దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో కల్వర్టు మంజూరు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి సీనియర్
# బేస్ బాల్ పోటీలు ప్రారంభం




**ఆదిలాబాద్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో శనివారం సాయంత్రం 5వ సీనియర్ మహిళలు, పురుషులు రాష్ట్రస్థాయి బేస్ బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. రాష్ట్రం నుంచి 33 జట్లు ఈ పోటీలకు హాజరయ్యాయి. రాష్ట్ర బేస్ సంఘం అధ్యక్షుడు హరిశంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అత్యుత్తమంగా ఆడిజాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్వేత, కోశాధికారి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# మల్లికార్జున్‌ను పరామర్శించిన ఎమ్మెల్యే



**బెల్లంపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి పట్టణంలోని 29వ వార్డు (డబ్బు సేట్ లైన్) కు చెందిన ఆటో డ్రైవర్ బండారి మల్లికార్జున్ తీవ్ర అనారోగ్యంతో రెండు కాళ్లను కోల్పోయిన విషయాన్ని తెలుసుకొని శనివారం రాత్రి బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం వినోద్ అతన్ని పరామర్శించారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. మల్లికార్జున్ కుటుంబానికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటానని చెప్పారు. శాసనసభ్యులు వినోద్ వెంట టీపీసీసీ రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, నాయకులు దావ రమేష్, రామిల్ల ప్రదీప్‌లు ఉన్నారు.

# వచ్చే నెల నుంచి బ్యాగుల్లో రేషన్ బియ్యం?

**ముథోల్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**




తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతుంది. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకి శుభవార్త చెప్పబోతుందని సమాచారం. మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేశారు కనుక.. ఆగస్టు వరకు రాష్ట్రంలో రేషన్ పంపిణీ ఆగిపోయింది. వచ్చె నెల అనగా సెప్టెంబర్ నుండి రేషన్ పంపిణీ తిరిగి ప్రారంభం కాబోతుంది. ఈ క్రమంలో రేషన్ తీసుకునే వారికి ఉచితంగా రేషన్ బ్యాగులను ఇవ్వనుంది. ఈ బ్యాగుల్లో సన్న బియ్యంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు కూడా ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈ బ్యాగులు రాష్ట్రంలోని అన్ని రేషన్ డిపోలకు చేరాయని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ నెల నుంచి రాష్ట్రంలోరేషన్ తీసుకునే వారికి సన్న బియ్యంతో పాటు ఈ ప్రత్యేకమైన బ్యాగులను ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ బ్యాగును బయట కొనాలంటే రూ.50 వరకు ఉంటుంది. ఈ బ్యాగులపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఫొటోల తో పాటుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటో కూడా ఉంటుంది. అలానే ఈ బ్యాగు మీద ఇందిరమ్మ అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలను కూడా ముద్రించారు.



# ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

**కాగజ్‌నగర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని పలు చోట్ల శనివారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక యాదవ సంఘం ఆధ్వర్యంలో పల్లకి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పలల్లకి సేవ స్థానిక యాదవ సంఘం నుంచి ప్రారంభమై పట్టణ పలు వీధుల మీదుగా కొన సాగింది. వేడుకలను పురస్కరించుకుని సరస్వతి శిశుమందిర్ పాఠశాలో ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

**వాంకిడి :** వాంకిడి మండల కేంద్రంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘం ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. హనుమాన్ ఆలయ ఆవరణలో ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శంకర్, సుచిత్, దీపక్‌ముండే తదితరులు పాల్గొన్నారు.

**సిర్పూర్(యు) :** సిర్పూర్(యు) మండలంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఆలయలలో పూజలు చేశారు.

**చింతలమానేపల్లి :** చింతలమానేపల్లి మండల వ్యాప్తంగా కృష్ణాష్టమి వేడుకలను మండల ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 24 గంటల పాటు ఎక్కాహం నిర్వహించారు. శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని పలు వీధుల గుండా ఊరేగింపు చేపట్టారు. కర్జల్లి ఓంకార ఆశ్రమంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అన్నదానం నిర్వహించారు.

**దహెగాం :** దహెగాం మండల కేంద్రంలోని శివకేశవ ఆలయ ప్రాంగణంలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎక్కాహం నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగడిబజార్ ఏరియాలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏడు జట్లు పాల్గొనగా విజేతలకు ఎస్సై విక్రమ్ నగదు పారితోషికం అందజేశారు. నిర్వహకులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కులను కాపాడే నాయకుడినే గెలిపించుకోవాలి

**కాసిపేట, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

ఓరియంట్ సిమెంట్ కంపెనీలో కార్మికుల హక్కులను కాపాడే నాయకున్నే గెలిపించుకోవాలని తెలంగాణ కనీస వేతనాల కమిటీ చైర్మన్ జనక్ ప్రసాద్ అన్నారు. శని వారం దేవాపూర్ కంపెనీ ఆవరణలో ఓరి యంట్ సిమెంట్ స్టాప్ అండ్ వర్కర్స్ ఫెడరే షన్ యూనియన్ నిర్వహించి గేటు మీటిం గ్‌కు ఆయన అతిథిగా హాజరై మాట్లాడారు. ఓ రియంట్ సిమెంట్ కంపెనీలో కన్నేళ్లుగా కార్మి కులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. వా రి హక్కుల పరిరక్షణ కోసం కొక్కిరాల సత్య పాల్‌రావును గెలిపించుకోవాలని సూచించా రు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు సీఎస్ఆర్ నిధులను ఓ రియంట్ ప్రభావిత గ్రామాల్లోనే అభివృద్ధి ప రిచేందుకు కృషి చేస్తామన్నారు. ఓరియంట్ కార్మికులకు గ్రూపు గ్రాట్యువిటి ఇప్పించే వి ధంగా యాజమాన్యంతో పోరాడి సాధిస్తామన్నారు. కార్యక్రమంలో ఓ రియంట్‌సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ యూనియన్ అధ్యక్షులు కొక్కిరాల సత్యపాల్‌రావు మాట్లాడు తూ యూనియన్ అధికారంలోకి



వస్తే కార్మికు ల కోసం 24గంటల వైద్యసదుపాయం కల్పించడంతో పాటు 5లక్షల మెడిక్లైమ్ ఇప్పిస్తామ ని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎ న్‌టీయుసీ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు కాం పెల్లి సమ్మయ్య, మందమర్రి ఏరియా ఉపాధ్య క్షుడు దేవి భూమయ్య, రాపర్తి శ్రీనివాస్, గిరి జన సంఘాల నాయకులు సిడాం అచ్యుత్ రావు, రాందాస్, కుమురం జనార్ధన్, సతీష్ రెడ్డి, శంకర్, సతీష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.















# వర్ష బీభత్సం







ఎడతెరిపిలేని వానలతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వాసులు చిగురుటాకులా వణికిపోతున్నారు. ఎటు చూసినా నీరే... కాలు బయటపెట్టనివ్వని వర్షం. రోడ్డేదో... గుంత ఏదో తెలియని భయానక పరిస్థితి. ఇప్పటికే పదుల సంఖ్యలో ఇళ్లు కుప్పకూలాయి. బయటకు వెళ్లలేక, పాత ఇళ్లలో గడపలేక జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ఏజెన్సీలో పరిస్థితి మరీ అగమ్యగోచరంగా తయారైంది. కల్వర్టులు కొట్టుకుపోయి, రోడ్లు కోతకు గురై.. స్తంభాలు నేలకొరిగాయి.. పంటలు మొత్తం నీట మునిగాయి. మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో వరుణుడి ప్రతాపం బీభత్సం సృష్టించింది. ఎగువ మహారాష్ట్రలో వర్షాల ప్రభావం కారణంగా ఉమ్మడి జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు అన్నీ నిండాయి. ప్రధాన ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు 18 గేట్లు, స్వర్ణ ప్రాజెక్టు నాలుగు గేట్లు, కొమురం భీం ప్రాజెక్టు నాలుగు గేట్లు, మత్తడి వాగు రెండు గేట్లు, గడ్డన్న వాగు ప్రాజెక్టు మూడు గేట్లు చొప్పున ఎత్తి నీటిని వదులు తున్నారు. కడెం ప్రాజెక్టులో ఒక జాలరి చేపల వేటకు వెళ్లి గల్లంతయ్యారు. చింతలమానేపల్లి, పెంచికల్‌పేట్, బెజ్జూరు తదితర మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఏజెన్సీ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. గుడిహత్నూర్ మండలంలో వరదల్లో చిక్కుకున్న ఆరుగురిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.









## కుండపోత వర్షంతో మంచిర్యాల
# జిల్లా అతలాకుతలం

- జిల్లాలో భారీ వర్షం
- ఉప్పొంగిన వాగులు, నిలిచిన రవాణా సౌకర్యం
- గరిష్టంగా కోటపల్లిలో 15.8 సెం.మీ నమోదు
- జిల్లాలో సగటు వర్షపాతం 6.2 సెం.మీ.
- ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కొనసాగుతున్న వరద
- ఓసీపీల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం
- వరద ప్రభావిత ప్రాంతాల్లో కలెక్టర్ పర్యటన



**మంచిర్యాల, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జిల్లాలో శనివారం భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచే ప్రారంభమైన వర్షం తెల్లవారి ఉగ్రరూపం దాల్చింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా జనజీవనం అతలాకుతలం అయింది. గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తు న్నాయి. చెరువులు, వాగుల్లో భారీగా వరద నీరు చేరుతోంది. వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో రవాణా సౌకర్యం నిలి చిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎగువున కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లా కేంద్రంలోని రాళ్లవాగు ప్ర మా దకర స్థితిలో ఉప్పొంగి ప్రవహిస్తోంది. అమరవీరుల స్థూపం వద్దగల కాజువే వంతెనపై నుంచి ఉధృతంగా వరద నీరు ప్ర వహిస్తుండటంతో రంగంపేట- లక్ష్మీనగర్ మధ్య రవాణా నిలిచిపోయింది.

**జిల్లాలో వర్షపాతం నమోదు...**

జిల్లాలో శనివారం 6.2 సెం.మీ సగటు వర్షపాతం నమోదుకాగా, కోటపల్లి మండలంలో గరిష్టంగా 15.8 సెం.మీ వర్షం కురిసింది. వేమనపల్లి మండలంలో 11 సెం.మీ, చెన్నూరు మండలంలో 8.8, లక్సెట్టిపేట మండలంలో 7.8, కాసిపేట మం డలంలో 7.7, జైపూర్ మండలంలో 6.9, నెన్నెల మండలంలో 6.8. మందమర్రి మండలంలో 5.8, జన్నారం మండలంలో 5.7, భీమారం మండలంలో 5.6



సెం.మీ, బెల్లంపల్లిలో 4.7, నస్పూర్‌లో 4.6. చొప్పున వర్షపాతం నమోదైంది.

**ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీ వరద...**

ఎగువున కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పెద్ద మొత్తంలో వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 148.00 మీటర్లకు గాను ప్రస్తుతం 146.63 మీటర్లకు నీరు చేరింది. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీ లు కాగా ప్రస్తుతం 16.463 టీంఎసీల నీరు నిలువ ఉంది. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 90,118 క్యూసెక్కుల నీరు చేరుతోంది. ప్రాజెక్టు అవుట్ ఫ్లో 13,007 క్యూసెక్కులు ఉండగా, హైద్రా బాద్ మెట్రోపాలిటన్ వాటర్ స్కీం కోసం 286 క్యూసెక్కులు, ఎన్టీపీసీ అవసరాలకు 121 క్యూసెక్కులు, జగిత్యాల జిల్లా నం దిమేడారంలోని నంది పంప్ హౌజ్‌కు 12,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

**కడెం ప్రాజెక్టు 16 గేట్లు ఎత్తివేత....**

గోదావరి బేసిన్‌లోని నిర్మల్ జిల్లా కడెం రిజర్వాయర్‌కు ఉన్న 18 గేట్లలో 16 గేట్లు తెరిచి 1,41,489 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి పూర్తిస్థా యిలో నీరు చేరడంతో సాయంత్రం 5గంటల వరకు 10 గేట్లను ఎత్తి 26వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు

**ఓపెన్ కాస్టుల్లో నిలిచిన ఉత్పత్తి...**

ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షం కారణంగా జిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్ లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచిపోయాయి. ఓబీ మట్టి తొలగింపు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. క్వారీల్లో పెద్ద మొత్తంలో నీరు చేరడంతో పనులు జరగడం లేదు. దీంతో యంత్రాల సహాయంతో నీటిని తోడుతున్నారు. ముఖ్యంగా మొదటి, రెండవ షిఫ్టుల్లో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

**పొంగిపొర్లిన డ్రైనేజీలు, ఒర్రెలు..**

శనివారం ఉదయం నస్పూర్ పట్టణంలో భారీ వర్షం కురిసింది. రెండు గంటలకుపైగా కురిసిన వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాల్లోకి ఇళ్లలోకి వరద నీరు వచ్చి చేరింది. డ్రైనేజీలు, ఒర్రెలు వరద నీటితో నిండిపోయి ఉధృతంగా ప్రవహించాయి. సంఘమల్ల య్య పల్లె ప్రాంతం నుంచి ఊరు శ్రీరాంపూర్ మీదుగా న స్పూర్ చెరువులోకి వచ్చే ఒర్రె వరద నీటి ప్రవాహంతో ఉధృ తంగా ప్రవహించింది. కాలనీల్లోకి వరద నీరు చొచ్చుకువ చ్చింది. వరద నీరు చేరడంతో సీతారాంపల్లి రోడ్డులోని వెంకటే శ్వర కాలనీలోని పలువురు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సీ సీసీ కార్నర్ నుంచి సీతారాంపల్లికి వెళ్లే మార్గంలో ఒర్రె కాజ్‌వే పై నుంచి ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. న స్పూర్ చెరువు పూర్తి స్థాయిలో నిండి పోయి ఎక్కువైనా నీరు మత్తడి ద్వారా దిగువకు వెళ్లుతుంది. దిగువన గోదావరి రోడ్డులో వరద నీరు పొలాల నుంచి ప్రవహిస్తూ రోడ్డు పై నుంచి వెళుతుంది. వినూత్న కాలనీ, శ్రీశ్రీ నగర్‌ల మధ్య గల తో ళ్లవాగు కాజ్‌వే పై నుంచి ప్రవహించడంతో స్థానికులు ఇబ్బం దులు ఎదుర్కొన్నారు. తాళ్లపల్లి పునరావాస కాలనీలో ఒర్రె వ రద నీటితో ఉదృతంగా ప్రవహించడంతో నీరు ముందుకు వె ళ్ల చుట్టు పక్కల ఉన్న ఇళ్లలోకి చేరింది. రోడ్డు మార్గంలోని కాజ్‌వే వంతెన పై నుంచి ప్రవహించడంతో చాలా సేపు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వర్షానికి జనాలు నానా ఇబ్బం దులు ఎదుర్కొవాల్సి వచ్చింది.



## వాగుల వద్ద పోలీసుల పహారా

**కోటపల్లి, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలో భారీ వర్షం కురుస్తున్నది. వర్షం కారణంగా వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గోదావరి, ప్రాణహిత నదిలోకి కొత్తగా నీరు వచ్చి చేరుతుండడంతో నదులలో ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. కాగా భారీ వర్షాలతో కోటపల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రాణహిత, గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలు నదుల వైపు చేపల వేటకు వెళ్లకూడదని.. నదులు, వాగులు, చెరువులు, కుంటలు, ఒర్రెలు దాటే ప్రయత్నం చేయకూడదని చెన్నూర్ రూరల్ సీఐ బన్సీలాల్, కోటపల్లి ఎస్ఐ రాజేందర్‌లు సూచించారు. విద్యుత్ ప్రమాదాల ముప్పుపొంచి ఉండటంతో విద్యుత్ తీగలు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దగ్గరగా వెళ్లవద్దని, పశువుల కాపరులు పశువులతో అడవులు, వాగులు దాటి వెళ్లకుండా జాగ్రత్త వహించాలన్నారు. మట్టి గోడలు, పాత ఇండ్లు, శిథిలావస్థకు చేరిన ఇండ్లలో నివసిస్తున్న వారు వెంటనే సురక్షిత ప్రాంతాలలో ఉండాలని పేర్కొన్నారు. కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న వాగులు ప్రవాహంతో ఈ మార్గంలో ప్రయాణికులు వారి తమ ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని కోటపల్లి ఎస్ఐ రాజేంద్ర సూచించారు.

## మాదారంలో 'డీడీ' మస్త్ మజా కార్యక్రమం

**తాండూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం సింగరేణి ప్రాంతమైన మాదారం టౌన్ షిప్ సింగరేణి కమ్యూనిటి హాలులో శనివారం రోజున దూరదర్శన్ (డీడీ యాదగిరి) ఆధ్వర్యంలో మస్త్ మజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు మహిళలకు ఆటలు, పాటలు, నృత్యాలు కోలాటాలు తదితర పోటీలను నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో టౌన్షిప్ లోని మహిళలు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఎంజాయ్ చేస్తూ సందడి చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ప్రొడ్యూసర్ గీత, అసిస్టెంట్ శ్రీనివాస్, జేఎస్ కుమారి, యాంకర్ వినీల్,



ఆడియో కృష్ణమూర్తి, జయప్రసాద్, కెమెరామెన్లు వంశీకృష్ణ, ఉదయ్, అహ్మద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ ఉపాధ్యక్షురాలు సుగుణ జన్మదిన వేడుకలు



**జైనూర్, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

జైనూర్ మండల కేంద్రంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ జన్మదిన వేడుకలను శనివారం జైనూర్ మండల వ్యాప్తం టగా కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు అంగరంగ వైభవంగా నిర్వహించారు.మండలంలోని కాంగ్రెస్ కార్యాలయంలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పార్టీ జెండాలు చేతబట్టి, పటాకులు పేలుస్తూ, కేక్ కట్ చేస్తూ సుగుణ నాయకత్వంలో పార్టీ బలపడాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ సుగుణక్క పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు బలమైన ఆవాజ్, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలుస్తూ, కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయికి చేర్చుతున్న నాయకురాలు అని కొనియాడారు. సుగుణక్కకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన అభిమానులు, గ్రామస్తులు సుగుణక్క ప్రజా సేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ చైర్మన్ కూడ్మేత విశ్వనాత్ రావ్ మండల అధ్యక్షుడు అబ్దాల్ ముఖీద్ మండల మాజీ కోప్షన్ మెంబెర్ అఫ్రోజ్ ఖాన్ అజ్జు లాల వసీమ్ ప్రకాష్ కనక గంగారం కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.త



## విరబూసిన బ్రహ్మకమలం

**పెంచికల్‌పేట, ఆగస్టు 16 (ప్రభాత సమాచారం)**

బ్రహ్మకమలం ఇది ఒక అరుదైన పుష్పం. రాత్రి పూట వికసించి ఉదయాన్నే వాడిపోవడం దీని ప్రత్యేకత. ఈ అరుదైన ఈ పుష్పం కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలంలోని చెడ్వాయి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చౌదరి సుజాత, శ్రీనివాస్ ఇంట్లో శుక్రవారం రాత్రి వికసించింది. హిమాలయ పర్వతాల్లో కనిపించే ఈ అరుదైన మొక్కను మూడేళ్ల క్రితం హైదరాబాద్‌లో కొనుగోలు చేసి ఇంటి ఆవరణలో నాటారు. ఇప్పుడు ఈ పుష్పం వికసించడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శివుడికి ప్రీతిపాత్రమైన పుష్పంగా పురుణాల్లో ఉందని, ఏడాదిలో ఒక సారి మాత్రమే అది రాత్రివేళల్లో పూస్తుందని చెబుతున్నారు. రాత్రివేళల్లో శ్వేత వర్ణంలో పెద్దగా వికసించే ఈ పూలు ఉదయానికి మొగ్గలా ముడుచుకుంటాయి.